ప్రజాశక్తి

గురువారం 1 జనవరి, 2026 | 9 పేజీలు | శ్రీకాకుళం

సహకార రంగం బలోపేతమే లక్ష్యం

రాష్ట్ర సహకారశాఖ మంత్రి అచ్చెన్నాయుడు

(వార్త...మెయిన్‌లో)

న్యూ ఇయర్ జోష్

- 2026 స్వాగత వేడుకల్లో కేరింతలు
- కేకులు కట్ చేసి సంబరాలు

నిన్నటి దాకా వెంట వచ్చిన నేస్తం ఇక సెలవంటూ తెరచాటుకు తప్పకుంది. ఏడాదంతా చేయి పట్టుకు నడిచి వీడ్కోలు చెప్తూ, కాలం పరదాల మాటున మాయమైంది. ఎన్నో అనుభూతులు, అనుభవాలను పంచి ఇచ్చిన మరో సంవత్సరం కాలగర్భంలో కలిసింది. నెలలు రోజులై, రోజులు గంటలై, గంటలు నిమిషాలు... క్షణాలై... మరో ఏడాది మన గుప్పెట్లో నుంచి జారి అదృశ్యమై అంతర్ధానమైంది. ఆ ఏడాది అలా వెళ్లిందో, లేదో.. మరింత అందంగా.. మరింత నవ్యంగా.. మరిన్ని ఆశలతో... కొత్త సంవత్సరం రానే వచ్చింది.

ప్రజాశక్తి - శ్రీకాకుళం

కొత్త ఆలోచనలు... కొంగొత్త ఆశయాలతో... 2025కి వీడ్కోలు పలుకుతూ నూతన సంవత్సరానికి ఘన స్వాగతం పలికారు జిల్లా ప్రజలు. నవోత్సాహంతో బుధవారం రాత్రి 12 గంటలకు నూతన సంవత్సరం 2026కు సాదర స్వాగతం పలికారు. కేకులు కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. హ్యాపీ న్యూ ఇయర్ అంటూ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

నూతనోత్సాహంతో...

నూతన సంవత్సర వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పట్టణాలు, పల్లెల్లోనూ ఏర్పాట్లు చేసుకున్నారు. బుధవారం అర్ధరాత్రి 12 గంటలకు హ్యాపీ న్యూ ఇయర్ అంటూ కేకులు వేస్తూ యువత సంబరాలు చేసుకున్నారు. దూరప్రాంతాల్లో ఉండే కుటుంబ సభ్యులు, స్నేహితులు, సన్నిహితులకు వీడియో కాల్స్ చేస్తూ కొత్త సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో భారీగా కేకుల విక్రయాలు సాగాయి. ప్రధాన రోడ్లలో బేకరీల యాజమాన్యాలు ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేసి కేకులను విక్రయించారు. మిఠాయిలను భారీఎత్తున అందుబాటులోకి తెచ్చారు. స్వీట్ షాపులు, బేకరీలు, పూల బొకేల దుకాణాలు వినియోగదారులతో కిటకిటలాడాయి.

శ్రీకాకుళం నగరంలో విక్రయిస్తున్న కేకులు

'ఇండోసోల్' ముప్పపై అప్రమత్తంగా ఉండాలి

- సరుబుజ్జిలిలో థర్మల్ పవర్ ప్లాంట్ నిర్మాణం వెనుక ఉన్నది ఆ కంపెనీయే
- 'కరేడు' స్ఫూర్తితో ఆ ప్లాంట్‌ను తిప్పికొట్టాలి
- సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.అజయ్ కుమార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఇండోసోల్ కంపెనీపై జిల్లా ప్రజలు ప్రత్యేకించి సరుబుజ్జిలి ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.అజయ్‌కుమార్ అన్నారు. నెల్లూరు జిల్లా కరేడులో సారవంతమైన భూముల్లో ఇండోసోల్ కంపెనీ ఏర్పాటు చేయనున్న సోలార్ పవర్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా అక్కడి ప్రజలు సాగిస్తున్న ఉద్యమంలో ప్రత్యక్షంగా పాల్గొంటున్న ఆయన, 'ప్రజాశక్తి'తో ఆ పోరాట అనుభవాలను పంచుకున్నారు. ఒకవైపు మున్నేరు నది, మరో వైపు సముద్రతీరం వంటి సహజ సిద్ధమైన వనరులతో పాటు జాతీయ రహదారి హద్దుగా కలిగిన కరేడు ప్రాంతంలో పుష్కలంగా పంటలు పండటంతో పాటు అపారమైన మత్స్యసంపద ఉందన్నారు. విదేశాలకు ఎగుమతయ్యే ప్రసిద్ధమైన మామిడి, సపోటా వంటి ఉద్యాన పంటలతో అలరారుతోందని వివరించారు. ఉపాధి కోసం ఇతర ప్రాంతాల వైపు చూడాల్సిన అవసరం అక్కడ లేదన్నారు. అటువంటి సస్యశ్యామలమైన, ప్రశాంత పల్లెలో ప్రభుత్వం సోలార్ చిచ్చు పెడుతోందని చెప్పారు. ఇండోసోల్ కంపెనీకి 8,200 వేల ఎకరాలను ప్రభుత్వం కట్టబెట్టి ప్రజల బతుకులను నాశనం చేయాలని చూస్తోందని విమర్శించారు

ఉద్యమాలతో ఇండోసోల్‌కు అడ్డుకట్ట

ఇండోసోల్ ఏర్పాటు చేయనున్న సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుతో వాటిల్లనున్న వినాశనంపై ప్రజలను (మిగతా...2)

4న బహిరంగ సభకు తరలిరావాలి

ప్రజాశక్తి - రణస్థలం, నరసన్నపేట, వజ్రపుకొత్తూరు

విశాఖపట్నంలో నిర్వహిస్తున్న సిఐటియు అఖిల భారత మహాసభల్లో భాగంగా ఈనెల నాలుగో తేదీన నిర్వహించే ప్రదర్శన, బహిరంగ సభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్.అమ్మన్నాయుడు పిలుపునిచ్చారు. రణస్థలంలోని డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్ వద్ద ఆ పరిశ్రమ కార్మికులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగో తేదీన మధ్యాహ్నం రెండు గంటలకు విశాఖపట్నం ఆర్‌టిసి కాంప్లెక్స్ అంబేద్కర్ విగ్రహం నుంచి ప్రదర్శన అనంతరం మున్సిపల్ స్టేడియంలో భారీ బహిరంగసభ నిర్వహిస్తున్నట్లు (మిగతా...2)



వజ్రపుకొత్తూరు : పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఆటో కార్మికులు

పక్కాగా వంద రోజుల ప్రణాళిక అమలు

ప్రజాశక్తి - పొందూరు

పదో తరగతిలో శతశాతం ఫలితాలు సాధనకు అనుసరిస్తున్న వంద రోజుల ప్రణాళికను పక్కాగా అమలు చేయాల్సిందేనని జిల్లా విద్యాశాఖాధికారి రవికుమార్ స్పష్టం చేశారు. పొందూరు మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, లోలుగు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం సందర్శించారు. ప్రార్థనా సమయానికే పాఠశాలను చేరుకున్న ఆయన పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను పరిశీలించారు. పదో తరగతిలో అత్యుత్తమ ఫలితాల సాధనే లక్ష్యంగా ఉపాధ్యాయులు శ్రమించాలన్నారు. పాఠశాల రికార్డులను పరిశీలించిన అనంతరం విద్యార్థులకు పిఎంశ్రీ కార్డులను పంపిణీ చేశారు. ఆయన వెంట ఎంఇఒ-1, 2 ఎం.వాగ్దేవి, పి.రాజారావు తదితరులు ఉన్నారు.

పదో తరగతి ప్రత్యేక తరగతులను పరిశీలిస్తున్న డిఇఒ రవికుమార్

ట్రోఫీని అందుకుంటున్న ఉద్యోగులు

రూ.3 వేల కోట్ల టర్నోవర్ లక్ష్యం

- గత ఆరు నెలల్లో రూ.140 కోట్ల డిపాజిట్ల సేకరణ
- జిల్లాలో పది కొత్త శాఖల ఏర్పాటుకు ప్రతిపాదనలు
- డిసిసిబి పర్సన్ ఇన్‌ఛార్జి శివ్వాల సూర్యనారాయణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లా కేంద్ర సహకార బ్యాంకు (డిసిసిబి) వచ్చే ఏడాది మార్చి నాటికి రూ.మూడు వేల కోట్ల టర్నోవర్‌కు చేరుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని బ్యాంకు పర్సన్ ఇన్‌ఛార్జి శివ్వాల సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని డిసిసిబి కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ఆరు నెలల కాలంలో బ్యాంకు అధికారులు, సిబ్బంది కృషితో బ్యాంకు డిపాజిట్లు రూ.140 కోట్లు, రుణాలు రూ.155 కోట్ల మేర (మిగతా...2)

వంశధార రిజర్వాయర్ పూర్తి చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

ప్రజాశక్తి - కొత్తూరు

జిల్లాకు గుండెకాయ వంటి వంశధార రిజర్వాయర్‌ను వెంటనే పూర్తి చేయకపోతే పోరాటం తప్పదని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కమిటీ సభ్యులు సిర్ల ప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన పార్టీ కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. వంశధార రిజర్వాయర్‌కు నీరు రావాలంటే నేరడి బ్యారేజీ నిర్మాణం జరగాలని, లేకుంటే తక్షణమే లిఫ్టుల ద్వారా రిజర్వాయర్ నింపితే, జిల్లాలో రెండు లక్షల 50 వేల ఎకరాలకు నీరందుతుందన్నారు. దీనివల్ల సంవత్సరానికి జిల్లాకు రూ.రెండు వేల కోట్ల ఆదాయం వస్తుందని తెలిపారు. ప్రజల ఆదాయం, కొనుగోలు (మిగతా...2)

'ప్రజాశక్తి' కార్యాలయంలో కొత్త సంవత్సర వేడుకలు

శ్రీకాకుళం ప్రతినిధి : ఎచ్చెర్ల మండలం కుశాలపురంలోని నవభారత్ ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని ప్రజాశక్తి శ్రీకాకుళం ఎడిషన్ కార్యాలయంలో బుధవారం రాత్రి కొత్త సంవత్సర వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రజాశక్తి సిబ్బందితో మేనేజర్ పి.కామినాయుడు కేకును కట్ చేయించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గడిచిన సంవత్సరంలో సాధించిన విజయాలను నెమరవేసుకుంటూనే కొత్త సంవత్సరంలో మరిన్ని లక్ష్యాలను రూపొందించుకుని, వాటిని నెరవేర్చుకోవడానికి చిత్తశుద్ధితో పనిచేయాలని పిలుపునిచ్చారు. సంస్థ పురోభివృద్ధి కోసం ప్రతి విభాగంలోని ఉద్యోగులు తమవంతు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో సమన్వయ కమిటీ సభ్యులు ఎ.సోమశేఖరరావు, జి.లక్ష్మణరావు, టి.భీమారావు, టి.బుజ్జిబాబు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేకు కట్ చేస్తున్న ప్రజాశక్తి సిబ్బంది

ఇళ్ల పట్టాలతో పూర్తి హక్కులు

- **జిఒ 30తో పేదల సొంతింటి కల సాకారం**
- **రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

ఏళ్ల తరబడి ఇళ్లు నిర్మించుకుని పన్నులు కడుతున్న నివాసాలపై ఎటువంటి హక్కుల్లేక ఇబ్బందులు పడుతున్న పేదలకు అండగా నిలవడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నగరంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో జిఒ నంబరు 30 ప్రకారం క్రమబద్ధీకరించిన ఇళ్ల పట్టాలను ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా కంపోస్టు కాలనీ పేరును చంద్రన్న కాలనీగా మారుస్తున్నట్లు ప్రకటించారు. అభ్యంతరాలు లేని ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న వారికి పూర్తి అధికారాలు కల్పించేలా మంత్రి లోకేష్ ప్రత్యేక చొరవ తీసుకున్నారని, ఆయన సహకారంతోనే ఈ జిఒ తీసుకొచ్చామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్న ఈ పథకాన్ని జిల్లాలో అధికారుల కృషి వల్ల తొలిసారిగా క్షేత్రస్థాయిలో విజయవంతం చేశామన్నారు. కొత్త ఏడాది కానుకగా పట్టాలు అందజేయడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలకు ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీలను ఆర్థిక ఇబ్బందులు ఉన్నా అమలు చేసి తీరుతామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం భూ సమస్యలను జటిలం చేసిందని, ప్రస్తుతం రెవెన్యూ సర్వే ద్వారా వాటిని పరిష్కరిస్తున్నామని తెలిపారు. ఏడాదిలోగా రాష్ట్రంలో భూ సమస్యలన్నీ కొలిక్కి రావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారని, ఇందుకోసం రెవెన్యూ అధికారులకు అదనపు అధికారాలు ఇచ్చామని చెప్పారు. సూర్యమహల్ కూడలి నుంచి పెద్దపాడు వరకు రోడ్డు విస్తరణ పనులు వేగంగా సాగుతున్నాయని, మరిన్ని రోడ్లను విస్తరించి శ్రీకాకుళం మాస్టర్‌ప్లాన్‌ను పక్కాగా అమలు చేస్తామన్నారు. రానున్న రథసప్తమి వేడుకలను ఏడు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు.

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ గతేడాది ఫిబ్రవరిలో జిఒ 30 వచ్చినా ఆర్‌డిఒ, ఎమ్మెల్యేల సమన్వయంతో క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేసి పట్టాల పంపిణీ చేపట్టిన మొదటి కార్యక్రమం ఇదేనన్నారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ అసెంబ్లీలో ఈ సమస్యను ప్రస్తావించామని, నగరంలోని మరికొన్ని కాలనీల్లోనూ ఈ పద్ధతిలో పట్టాలు అందజేస్తామన్నారు. జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ.. 175 మందికి డికెటి పట్టాలు ఇచ్చామని, దీనివల్ల 40 ఏళ్లుగా పన్నులు కడుతున్న వారికి నేడు ఆస్తిపై పూర్తి హక్కు లభించిందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ సాయిప్రత్యూష, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రముఖుల నూతన సంవత్సర శుభాకాంక్షలు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లా ప్రజలకు పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. ప్రజలందరి తోడ్పాటుతో గతేడాది శ్రీకాకుళం జిల్లాను అభివృద్ధి చేసుకున్నామని, ఇదే మద్దతుతో 2026లోనూ మరిన్ని అద్భుతాలు ఆవిష్కరిద్దామని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్త సంవత్సరం దేశాభివృద్ధి, ప్రజల సంతోషం, సమాజం ప్రగతి దిశగా ముందుకు సాగాలని ఆకాంక్షించారు. తనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేయడానికి వచ్చే వాళ్లు పూలు, పుష్పగుచ్ఛాలు అందించవద్దని కోరారు.

అభివృద్ధిలో అగ్రభాగాన నిలుపుదాం

నూతన సంవత్సరంలో అభివృద్ధిలో శ్రీకాకుళాన్ని అగ్రభాగాన నిలుపుదామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ ఏడాది జిల్లాలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టి, ప్రజల జీవన ప్రమాణాలను పెంపొందించడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న ప్రతి సంక్షేమ పథకం అర్హులందరికీ సకాలంలో అందేలా యంత్రాంగం నిరంతర కృషి చేస్తుందని హామీనిచ్చారు. యువత దురలవాట్లకు దూరంగా ఉండాలని, విద్యారంగంలో జిల్లా పేరును నిలబెట్టాలని ఆకాంక్షించారు.

శాంతియుతంగా చేసుకోవాలి

నూతన సంవత్సరంలో ఏర్పరచుకున్న లక్ష్యాలు, ఆశయాలన్నీ నెరవేరాలని ఎస్‌పి కె.వి మహేశ్వర రెడ్డి ఒక ప్రకటనలో ఆకాంక్షించారు. నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణంలో, నిబంధనలు పాటిస్తూ చేసుకోవాలని కోరారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా ప్రవర్తించకుండా, శాంతిభద్రతలకు భంగం కలగకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు.

రూ.3 వేల కోట్ల టర్నోవర్ లక్ష్యం

పెరిగినట్లు వివరించారు. ఖాతాదారుల విశ్వాసం చూరగొనడం వల్లే బ్యాంకు ఆ మేరకు ప్రగతి సాధించగలిగిందని అభిప్రాయపడ్డారు. బ్యాంకు పరిధిలో 22 బ్రాంచ్‌లు, 22 ఎటిఎంలు, 49 పిఎసిఎస్‌లు ఉన్నాయని తెలిపారు. జిల్లాలో త్వరలో కొత్తగా పది బ్రాంచ్‌ల ఏర్పాటుకు ఆర్‌బిఐకి ప్రతిపాదనలు పంపామన్నారు. అనుమతులు వస్తే చిలకపాలెం, పోలాకి, కొల్లివలస, సంతబొమ్మాళి, పూండి, నందిగాం, సరుబుజ్జిలి, కంచిలి, హరిపురం, జి.సిగడాం కొత్త శాఖలు ఏర్పాటు చేస్తామని వివరించారు. బ్యాంకు పరిధిలో 25 శాఖలకు గానూ ఏడింటికి సొంత భవనాలు ఉన్నాయన్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో నాలుగు, ఐదు సొంత భవనాల నిర్మాణాలకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో పలు పిఎసిఎస్‌ల్లో చోటుచేసుకున్న అక్రమాలపై విచారణ చేశామని, బ్యాంకులకు నష్టం వాటిల్లకుండా తగు చర్యలు తీసుకుంటామని చెప్పారు.

డిసిసిబి ముఖ్య కార్యనిర్వహణాధికారి దత్తి సత్యనారాయణ మాట్లాడుతూ డిసిసిబి కొత్తగా ప్రారంభించిన నవతి ప్రత్యేక డిపాజిట్ పథకాన్ని వ్యవసాయ, సహకారశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఇటీవల ప్రారంభించారని చెప్పారు. ఈ పథకం కింద 60 ఏళ్లు పైబడిన వారు 900 రోజుల పాటు డిపాజిట్ చేస్తే తొమ్మిది శాతం, సాధారణ పౌరులకు 8.50 శాతం వడ్డీని బ్యాంకు చెల్లించనుందని వెల్లడించారు. డిసిసిబి స్థాపించి బుధవారంతో 89 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పర్సన్ ఇన్‌ఛార్జి సూర్యనారయణ కేక్ కట్ చేశారు. సహకార ఉత్సవ్ 3.0లో భాగంగా రాష్ట్రస్థాయిలో నిర్వహించిన పలు క్రీడా పోటీల్లో గెలుపొందిన ఉద్యోగులకు బహుమతులను అందజేసి అభినందనలు తెలిపారు. సమావేశంలో జిఎంలు డి.వరప్రసాద్, శిమ్మ జగదీష్, ఎస్.వి.ఎస్ సత్యనారాయణ, డిజిఎంలు జి.సునీల్, ఎస్.రమేష్, ఎజిఎంలు ఆర్.కె భాస్కరరావు, బి.కోటేశ్వరరావు, ఎన్.ఉషాశాంతి, చీఫ్ మేనేజర్లు, మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

వంశధార రిజర్వాయర్ పూర్తి చేయాలి

శక్తి పెరగడం ద్వారా అనేక అనుబంధ పరిశ్రమలు వస్తాయన్నారు. కూలీలకు ఉపాధి లభించడంతో వలసలు నివారించబడతాయని చెప్పారు. జిల్లా అభివృద్ధి చెందాలంటే ప్రజల భూములను కార్పొరేట్ కంపెనీలకు ఇవ్వడం కాదని, సాగునీటి ప్రాజెక్టులు నిర్మించడం ద్వారానే సాధ్యమన్నారు. జిల్లా అభివృద్ధి చెందాలంటే వంశధార జలాలను వినియోగించడం ద్వారా ప్రజల ఆదాయం రెట్టింపు అవుతుందని తెలిపారు. రిజర్వాయర్ పూర్తి చేస్తే దానికయ్యే ఖర్చు ఏడాదిలోనే వస్తుందని, మరెందుకు పూర్తి చేయడం లేదో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో ఎందుకు పూర్తిస్థాయిలో నిధులు కేటాయించడం లేదని ప్రశ్నించారు. జిల్లా వెనుకబాటుకు కారణం పాలకుల నిర్లక్ష్యమేనని విమర్శించారు. గొట్టాబ్యారేజీ నిర్మాణం జరిగిన 50 ఏళ్లు పూర్తి కావడంతో శిథిలావస్థకు చేరుకుందన్నారు. గొట్టాబ్యారేజీ ఆధునీకరణకు రూ.1500 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. వంశధార రిజర్వాయర్ 21 గ్రామాల ప్రజలు త్యాగాలతో నిర్మించారని, నీరు రాకపోవడంతో అదో పెద్ద చెరువుగా నిరుపయోగంగా మిగిలిపోతుందన్నారు. వంశధార ప్రాజెక్టు నిర్మాణానికి భూములు ఇచ్చిన నిర్వాసితులను ఆదుకోవాలని, జిల్లాలో ఐటిడిఎ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వంశధార నదీ జలాలను చివరి భూముల వరకు నీరు ఇవ్వాలని, గొట్టాబ్యారేజీ ఆధునీకరణ చేయాలని, జీడి పంటకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిపిఎం నాయకులు ఎన్.అప్పన్న, ప్రజాసంఘాల నాయకులు రమేష్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

4న బహిరంగ సభకు తరలిరావాలి

తెలిపారు. కార్పొరేట్లకు మేలు చేసేందుకు, కార్మిక వర్గం హక్కులను హరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూనుకుంటున్నాయని, ఈ విధానాలకు వ్యతిరేకంగా బలమైన కార్మిక ఉద్యమాన్ని నిర్మించడంలో సిఐటియు అగ్రభాగాన నిలిచిందన్నారు. కార్మికవర్గం దశాబ్దాలుగా అశేష త్యాగాలతో సాధించుకున్న కార్మిక హక్కులను కార్పొరేట్ లు ప్రయోజనాలు కొరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని విమర్శించారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేట్లకు కొమ్ము కాసి కార్మిక ఉద్యమాలను అణచివేస్తున్నాయని, కార్మికుల ఏ ఒక్క సమస్యనూ పరిష్కరించకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్నారు. అసమానతలు, పేదరికం ఎన్నడూ లేని స్థాయికి చేరాయన్నారు. విశాఖపట్నంలో నిర్వహిస్తున్న అఖిల భారత మహాసభలు కార్పొరేట్ విధానాలకు

నరసన్నపేట : మాట్లాడుతున్న సింహాచలం

మొదటిపేజీ తరువాయి

ప్రత్యామ్నాయ విధానాలు రూపొందించబోతున్నాయన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయుకులు ఎం.ఈశ్వరరావు, పి.రామకృష్ణ, రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

నరసన్నపేట : గ్రామీణ పేదలకు పని హక్కుగా ఉన్న మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పేరు మార్చి నిర్వీర్యం చేసేందుకు కొత్త చట్టాన్ని తీసుకురావడం దుర్మార్గమని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరాపు సింహాచలం అన్నారు. నరసన్నపేట మండల కేంద్రంలో ఆటో వర్కర్స్ యూనియన్ కార్మికులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 4వ తేదీన నిర్వహించే ప్రదర్శన, బహిరంగ సభకు కార్మికులు, కష్టజీవులు, రైతులు, వ్యవసాయ కార్మికులు మేధావులు విద్యార్థులు, యువజనలు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కె.నరసింహులు, టి.మోహనరావు, దేవాది ఉమ, ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కోన రాజశేఖర్, ఉపాధ్యక్షులు దేవల రాజశేఖర్, ఆర్.ఫకీరు, పాగోటి అప్పన్న, డి.ఎర్రయ్య తదితరులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు : మండల కేంద్రంలో ఆటో కార్మికులతో నిర్వహించిన సమావేశంలో సిఐటీయు మండల కన్వీనర్ ఎన్.మోహనరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌లుగా విభజించి కార్మికులపై కేంద్ర ప్రభుత్వం దాడికి పూనుకుందన్నారు. ఎనిమిది గంటల పని విధానాన్ని 10 గంటలు పెంచి పెట్టుబడిదారులకు సానుకూలంగా నిలబడిందని మండిపడ్డారు. ప్రజాధనంతో నిర్మించుకున్న ప్రభుత్వరంగ సంస్థలను అదానీ, అంబానీలకు అప్పనంగా కట్టబెడుతున్నారని విమర్శించారు. స్కీమ్‌వర్కర్లతో వెట్టిచాకిరీ చేయించుకుంటున్నారు తప్ప కనీస వేతనాలకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మిక, శ్రామిక వ్యతిరేక విధానాలను ఐక్య ఉద్యమాల ద్వారా తిప్పికొట్టాలని, ఈ అంశాలపై సిఐటియు అఖిల భారత మహాసభల్లో రూపకల్పన చేయనున్నారని తెలిపారు. 4న బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో తిరుపతి, పరదేశీ, చిరంజీవి, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

'ఇండోసోల్' ముప్పుపై అప్రమత్తంగా ఉండాలి

చైతన్యపరిచామని తెలిపారు. అన్ని గ్రామాల్లోని ప్రజలు రాజకీయాలకతీతంగా పోరాడారని చెప్పారు. ప్రభుత్వ భూసేకరణ ప్రయత్నాలను తిప్పికొట్టారని తెలిపారు. ఇండోసోల్ వద్దు... మా గ్రామమే ముద్దు అంటూ నినదించారని చెప్పారు. ఇండోసోల్‌కు భూమికి కేటాయించడాన్ని నిరసిస్తూ ప్రతి ఇంటిపై నల్ల జెండాలను ఎగురవేశారని తెలిపారు. పోలీసులు సెక్షన్-30ని అమలు చేసినా ప్రజలు ధైర్యంగా ముందుకొచ్చి పోరాడారని చెప్పారు. భయంతో ప్రజలను లొంగదీసుకోవాలని చూసిన ప్రభుత్వానికి, ఆ ప్రయత్నం నెరవేరకపోవడంతో ప్రలోభాలకు గురిచేసిందన్నారు. ఎకరాకు రూ.20 లక్షల నుంచి రూ.22 లక్షలు ఇస్తామంటూ ఆశ చూపిందని, వీటికీ లొంగకుండా ప్రజలు పోరాటం సాగిస్తున్నారని వివరించారు.

ఇండోసోల్‌కు బాబు, జగన్ ఇద్దరూ మేళ్లు

ఇండోసోల్ కంపెనీ ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే వారు భూములు కేటాయించడం పరిపాటిగా మారిందన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఆ కంపెనీకి 5,500 ఎకరాలను కేటాయించారని గుర్తు చేశారు. టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఏకంగా 8,200 వేల ఎకరాలు కేటాయించిందని తెలిపారు. ఇద్దరూ పోటీ పడి కంపెనీకి భూములిచ్చి ప్రజలకు అన్యాయం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

సిఎం చంద్రబాబు ద్వంద్వవైఖరి

ఇండోసోల్ కంపెనీ విషయంలో సిఎం చంద్రబాబు నాయుడు ద్వంద్వవైఖరితో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ఆ కంపెనీకి 5,500 ఎకరాలు కేటాయిస్తే దాన్ని తప్పుపట్టారని గుర్తు చేశారు. కంపెనీ ప్లాంట్ ఏర్పాటు చేయదని, అది ఒక సూట్ కేసు కంపెనీ అని చంద్రబాబు నాడు చెప్పారని తెలిపారు ఇండోసోల్‌ను బ్లాక్ లిస్టులో పెట్టాలని నాడు ప్రతిపక్ష నేతగా డిమాండ్ చేసి, నేడు అదే కంపెనీ వైసిపి ప్రభుత్వం కంటే మరింత అధిక మొత్తంలో భూములు కేటాయించడం చంద్రబాబు ద్వంద్వవైఖరికి అద్దం పడుతోందన్నారు.

సరుబుజ్జిలి ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

శ్రీకాకుళం జిల్లా ప్రజలకూ ఇండోసోల్ కంపెనీ ముప్పు పొంచి ఉందన్నారు. సరుబుజ్జిలి ప్రాంతంలో నిర్మించనున్న థర్మల్ పవర్‌ప్లాంట్ నిర్మాణం వెనుక ఆ కంపెనీ ఉందన్న వార్తలు వస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వరంగ సంస్థ జెన్‌కో ప్లాంట్ నిర్మాణం చేపడుతుందని బయటకు ప్రచారం సాగుతున్నా, ఇండోసోల్‌కు అప్పగించనుందన్న ప్రచారం నేపథ్యంలో సరుబుజ్జిలి ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ప్రజల ఉపాధిని దెబ్బతీసి, కాలుష్యాన్ని వెదజల్లే పవర్ ప్లాంట్‌కు వ్యతిరేకంగా ఇప్పటికే స్థానికులు, గిరిజనులు కలిసికట్టుగా పోరాడడం మంచి పరిణామన్నారు. కరేడు స్ఫూర్తితో పవర్ ప్లాంట్ ప్రయత్నాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు.

ప్రభుత్వ రంగంతోనే విశాఖ నగరాభివృద్ధి

ఉమ్మడి రాష్ట్రంలోనే రెండో పెద్ద నగరంగా విశాఖ ఉంది. రాష్ట్ర విభజన తరువాత ఆంధ్రప్రదేశ్‌లో అతి పెద్ద నగరం ఇదే. స్వాతంత్ర్యానికి పూర్వం ఒక చిన్న మత్స్యకార గ్రామంగా ఉన్న విశాఖ నేడు అతి పెద్ద నగరంగానూ, ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న వంద నగరాలలో ఒకటిగానూ ఉండడానికి ప్రధాన కారణం.. నగరంలో నెలకొన్న ప్రభుత్వ రంగ పరిశ్రమలే. ఇంకా విశాలంగా చెప్పాలంటే.. ప్రభుత్వ రంగ సంస్థలు దేశాభివృద్ధిలోనూ, దేశ స్వావలంబన సాధించడంలోనూ ప్రముఖ పాత్ర నిర్వహించాయి. అందుకే దేశ మొదటి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ ప్రభుత్వ రంగ పరిశ్రమలను ఆధునిక దేవాలయాలని అభివర్ణించారు. కానీ నేటి పాలకులు అటువంటి సంస్థలను ధ్వంసం చేయడమే ఒక విధానంగా పెట్టుకున్నారు.

1901 సంవత్సరంలో 40,892 మందిగా ఉన్న నగర జనాభా విశాఖ పోర్టు ట్రస్టు ఏర్పడిన తరువాత 1951 కల్లా రెట్టింపుకుపైగా పెరిగింది. హిందూస్థాన్ షిప్‌యార్డ్ స్థాపనతో ఈ పెరుగుదల క్రమం మరింత పుంజుకుంది. 1951-61 మధ్య పదేళ్ల కాలంలోనే నగర జనాభా రెట్టింపు పెరిగి 2.15 లక్షలకు చేరుకుంది. బిహెచ్‌పివి ఏర్పడిన తరువాత 1971 నాటికి 3,68,000కు జనాభా చేరింది. నేవల్ డాక్‌యార్డ్ విస్తరణ, విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్ ఏర్పడిన తరువాత 1991 కల్లా జనాభా 13.57 లక్షలకు పెరిగింది. ఇదంతా ప్రభుత్వ సంస్థల వల్లనే జరిగింది. ప్రభుత్వ సంస్థలలో మెరుగైన ఉపాధికై అనేక మంది గ్రామీణ ప్రాంతాల నుండి నగరానికి వలసలు వచ్చారు. వీటితో పాటు హెచ్‌పిసిఎల్, బ్యాంకులు, ఇతర ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల వల్ల 2011లో 17.43 లక్షలు, 2021లో 22.26 లక్షల జనాభా ఉంది. నేడు విశాఖ నగర జనాభా సుమారు 25 లక్షలుగా ఉంది.

ఈ ప్రభుత్వ సంస్థల నిర్మాణం వల్ల వాటిలో పనిచేసే ఉద్యోగుల గృహవసతి, గృహోపకర వస్తువులు వంటి అవసరాలు తీర్చడానికి సర్వీసు రంగం అభివృద్ధి అయింది. ఈ జనాభా ఆహార అవసరాల కోసం సమీప గ్రామాలలో కూరగాయల పంటలు పెరిగాయి. ఇలా పారిశ్రామికీకరణ వల్ల వ్యవసాయ, సర్వీసు రంగాలు కూడా అభివృద్ధి జరిగి, అనేక మందికి ఉపాధి అవకాశాలు కల్పించబడ్డాయి.

కేవలం జనాభా పెరగడమే కాక, ఇతర అవసరాలకు నగర వైశాల్యం కూడా క్రమంగా పెరుగుతూ వస్తోంది. నేడు 681 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంతో దేశంలోనే మూడో పెద్ద నగరంగా నిలిచింది. ఈ పారిశ్రామికీకరణ వల్ల 3,67,529 కోట్ల రూపాయల స్థూల జాతీయ ఉత్పత్తితో దేశంలో తొమ్మిదో సంపన్న నగరంగా ఉంది. వార్షిక బడ్జెట్ 4,171 కోట్ల రూపాయలుగా ఉంది.

అయితే 1991 నుండి దేశంలో అమలవుతున్న నయా ఉదారవాద ఆర్థిక విధానాల వల్ల ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ ప్రారంభమైంది. వీటి ప్రభావం విశాఖ నగరంపై కూడా సహజంగానే బలంగా పడింది. మహారత్న కంపెనీగా ఉన్న హిందూస్థాన్ జింక్ పరిశ్రమను పూర్తిగా అమ్మేయడం, తరువాత మూతబడడం జరిగింది. విశాఖపట్నం పోర్టు, షిప్‌యార్డ్, బిహెచ్‌పివి, డాక్‌యార్డ్ వంటి సంస్థలలో శాశ్వత ఉద్యోగుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. ఉదాహరణకు విశాఖపట్నం పోర్టులో 1991 నాటికి 13,019 మంది శాశ్వత కార్మికులుండగా 2021 నాటికి కేవలం 2,700 మంది మాత్రమే ఉన్నారు. షిప్‌యార్డులో 6,795 నుండి ఇదే కాలంలో కార్మికుల సంఖ్య 530 మందికి పడిపోయింది. బిహెచ్‌పివి 4 వేల నుంచి 550కు తగ్గిపోయింది.

విశాఖ నగరానికే కాక, రాష్ట్రానికే తలమానికంగా ఉన్న విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది. అత్యధిక మందికి ఉపాధి కల్పిస్తున్న ఈ భారీ పరిశ్రమ ప్రభుత్వ రంగం నుంచి వైదొలగడమంటే అది విశాఖ అభివృద్ధికి అశనిపాతమే. దీనిని పరిరక్షించుకోకుండా రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని పారిశ్రామిక విధానాలు ప్రకటించినా ఫలితం శూన్యమే. ఆధునిక టెక్నాలజీ, ఓడరేవు కలిగి దేశంలోనే విశిష్ట స్థానంలో నిలిచిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను కాపాడే భాధ్యత రాష్ట్ర ప్రయోజనాల రీత్యా రాష్ట్ర ప్రభుత్వంపైనా ఉంది.

నగరాభివృద్ధిలో విశేషమైన పాత్ర పోషించిన ఇటువంటి ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడం ద్వారానే అభివృద్ధిని సుస్థిరం చేసుకోవడం, మరింత అభివృద్ధి సాధించడం సాధ్యం. సాధారణ ప్రజానీకం, అభివృద్ధి కాముకులు ఈ దిశలో కృషి చేసి, ప్రభుత్వం ప్రయివేటీకరణ విధానాలను ఉపసంహరించుకునేలా ఒత్తిడి తేవడమే నేటి కర్తవ్యం. ఎన్నికల ముందు స్టీల్ ప్లాంట్‌ను కాపాడతామని హామీ ఇచ్చిన తెలుగుదేశం, జనసేన పార్టీలు ఆ హామీకి కట్టుబడి ఉండేలా రాష్ట్ర ప్రజలు చైతన్యం చూపాలి. ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కోసం సిఐటియు సమరశీల పోరాటాలు నిర్వహిస్తోంది. ఆ సంఘం అఖిల భారత మహాసభ విశాఖలో ప్రస్తుతం జరుగుతుండటం గర్వకారణం.

- ఎ.అజశర్మ,
ప్రధాన కార్యదర్శి,
ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక

ఐదో రోజూ అదే జోష్

ఆద్యంతం ఉత్సాహంగా ఆట పాట

చైతన్యం నింపిన గేయాలు

అబ్బుర పరిచిన పులివేషాలు

విజయనగరం కళాకారుల పులివేషాల ప్రదర్శన

ప్రజాశక్తి-భీమునిపట్నం

సిఐటియు అఖిల భారత మహాసభల నేపథ్యంలో ఎయు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో శ్రామిక ఉత్సవ్ పేరిట ఐదో రోజు బుధవారం ప్రజానాట్య మండలి కళాకారులు ప్రదర్శించిన నృత్యాలు, అభ్యుదయ గేయాలు.. ఉత్తరాంధ్ర జానపద కళాకారుల పులివేషాలు అబ్బుర పరిచాయి. "పని గంటలు పెంచి నారు కార్మికుడా.. ఇది తగదంటూ నినదించు శ్రామికుడా", "మానసిక ఒత్తిడికి లోనవుతాను.. శారీరక శక్తినంతా కోల్పోతాను", "గ్యారెంటీ లేని కొలువులు చేస్తావు" అంటూ కళాకారులు పాడిన పాటలు సభికులను ఉత్సాహ పరిచాయి. కార్మికులు తమ శారీరక శక్తినంతా ధారపోసి సంపద సృష్టిస్తున్నా సరే ఉద్యగ భద్రత లేని పరిస్థితులను వివరించారు కళాకారులు.

ఉత్సాహంగా నృత్యం చేస్తున్న పిఎన్‌ఎం కళాకారులు

విజయనగరం జిల్లాకు చెందిన కళాకారులు ప్రదర్శించిన పులివేషాలు అబ్బుర పరిచాయి. "తెలుగు పండగలు తెల్ల బోయి.. ఇంగ్లిష్ పండగలు ఎక్కిలిస్తున్నాయి", రైతన్నా ఎట్టేట్టో బతికేటోడివి.. ఇట్టేట్టా ఐతివో రైతన్నా.. అంటూ కళాకారులు పాడిన పాటలు సభికులను హత్తుకునేలా చేశాయి. రైతులు సంప్రదాయ బద్ధంగా చేసుకునే భోగి, సంక్రాంతి పండగలు నిర్వచనం మారేలా నిర్వహించుకోవడాన్ని పాడిన పాటలు సభికులను ఆలోచింపజేశాయి. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కోసమని గిరిజనులను, ఆయా ప్రాంత ప్రజలను గోదాట్లో ముంచేస్తే ఊరుకోబోమని, ప్రత్యేక ప్యాకేజీ ఇవ్వాల్సిందేనని చెబుతూ "అమ్మ పీక నొక్కేసి.. అడవి నుంచి గెంటేసి.. పద పద పద మనది ఒకటే మాటై.. పోరుబాటకై.. ఎర్రజెండా మా వెంటే నడుస్తుంది..' అంటూ కళాకారులు పాడిన పాట ఆద్యంతం ఆలోచనలు రేకెత్తించింది.

"కార్మికులం.. శ్రామికులం. తరతరాల దోపిడీకి నలిగిన కూలీలం.. గాలి, నీరు, భూమంతా నీ సొంతమా? గానుగెద్దు లాంటి బతుకు మాకు సొంతమా" అంటూ సినీ దర్శకులు బాబ్జీ ఒకింత ఆవేశంగా పాట పాడారు. పెట్టుబడి దారుల ప్రయోజనాల కోసం పాలకులు ఎలా వ్యవహరిస్తున్నది ఆయన క్లుప్తంగా పాట ద్వారా వివరించారు.

ప్రజాశక్తి
www.prajasakti.com
శ్రీకాకుళం
గురువారం 1 జనవరి 2026

డ్రగ్స్‌పై పిఎన్ఎం కళాకారుల ప్రదర్శన

సాగర తీరంలో కార్మికోత్తేజం

విశాఖ సాగర తీరాన బుధవారం కార్మిక పండగ ఆరంభమైంది. తీరం ఎర్రబారింది. ఒకవైపు సిఐటియు అఖిల భారత మహాసభను పురస్కరించుకుని బీచ్ రోడ్డులోని ఎయు కన్వెన్షన్ సెంటర్ వెనుక ఉన్న ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో సాగుతున్న శ్రామిక ఉత్సవ్, మరోవైపు అసలు పెద్ద పండగైన సిఐటియు అఖిల భారత మహాసభ సందడి అందరిలో ఉత్తేజం నింపాయి. దేశ నలుమూలల నుంచి కార్మిక రంగ ప్రతినిధులు ఈ మహాసభకు తరలివచ్చారు. సోదర కార్మిక సంఘాలు సౌహార్ద్ర సందేశాలిచ్చాయి. శ్రామిక ఉత్సవ్‌కు సినీ దర్శకుడు బాబ్జీ ముఖ్య అతిథిగా హాజరై చేసిన ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

CITU
18TH ALL INDIA CONFERENCE
2025 DEC 31 - 2026 JAN 4, VISAKHAPATNAM

మాట్లాడుతున్న కెఎస్.చలం

మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

కళాకారులను అభినందిస్తున్న నిర్వాహకులు

బాబ్జీకి జ్ఞాపిక అందజేత

తప్పెటగుళ్ల కళాకారుల ప్రదర్శన

అల్లూరి స్మారక జ్యోతితో సిహెచ్.నర్సింగరావు, అనకాపల్లి జిల్లా నాయకులు

వేదికపై కార్మిక సంఘ అగ్రనేతలు

ప్రతినిధులకు స్వాగతం

సౌహార్ద సందేశాలిస్తున్న నాయకులు

శ్రామిక ఉత్సవ్‌లో పెంచలయ్య భార్య దుర్గ తదితరులు

ప్రశంసా పత్రాలతో తప్పెటగుళ్ల కళాకారులు

మహాసభ ప్రారంభోత్సవ కార్యక్రమంలో నాయకులు, ప్రతినిధులు

మాట్లాడుతున్న బాబ్జి. వేదికపై సుబ్బరావమ్మ, ప్రొఫెసర్ చలం తదితరులు

మరో స్వాతంత్ర్య పోరాటానికి సిద్ధం కావాలి

'శ్రామిక ఉత్సవ్'లో సినీ దర్శకుడు, రచయిత బాబ్జి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

'దేశంలో ఖనిజ, అటవీ సంపదను ఇద్దరు గుజరాతీలు అమ్ముతుంటే ఇద్దరు గుజరాతీలు కొంటున్నారు. మనది అనేది ఏదీ లేకుండా చేయటమే ప్రస్తుత పాలకుల లక్ష్యం. కార్పొరేట్లకు అన్నింటినీ దోచిపెడుతున్నారు' అని సినీ దర్శకులు, రచయిత బాబ్జి అన్నారు. ఈ క్రమంలో మరో స్వాతంత్ర్య ఉద్యమానికి అందరం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సిఐటియు 18వ అఖిల భారత మహాసభ సందర్భంగా విశాఖ నగరంలో నిర్వహిస్తున్న 'శ్రామిక ఉత్సవ్' బుధవారానికి ఐదో రోజుకు చేరింది. 'సమాన పనికి సమాన వేతనం' అనే థీమ్‌తో సభ నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు బిడ్డగా తనను గుర్తించినందుకు ధన్యవాదాలు తెలిపారు. 'ఒక్కసారి అయినా కమ్యూనిస్టుగా బతుకు' అనే పాట రాసిన రచయితగా గుర్తించడం ఆనందదాయకమన్నారు. సిఐటియు అఖిల భారత మహాసభ విశాఖపట్నం నడిబొడ్డున జరుగుతున్న సందర్భంగా తాను ఇక్కడకు వచ్చానని, తాను విద్యార్థిగా ఉన్నప్పుడు విశాఖపట్నం ప్రజానాట్యమండలిలో పాటలు నేర్చుకున్నానని గుర్తు చేసుకున్నారు. ఆనాటి నుండి ఈనాటి వరకు కార్మికులు, వారిపై జరుగుతున్న దోపిడీపై పాటలు రాస్తూనే ఉన్నానని తెలిపారు. గాంధీజీ, గద్దర్, అల్లూరి మన హీరోలని చెప్పారు. చిన్ననాటి నుండి అల్లూరి విప్లవ భావాలు కలిగిన తనకు విశాఖ అంటే మక్కువ అని చెప్పుకొచ్చారు. బ్రిటిష్ పాలకులు చిన్నచిన్న వ్యాపారాల పేరుతో వచ్చి చాప కింద నీరులా ఎలా వ్యాపించారో.. ఇప్పుడు గుజరాతీయులు కూడా అలాగే వ్యాపిస్తున్నారని తెలిపారు. దేశం బానిసత్వంలోకి వెళ్లే ఛాయలు కనపడుతున్నాయని అన్నారు. మరో స్వాతంత్ర పోరాటం కోసం సిఐటియు జాతీయ మహాసభ పిలుపునివ్వాలన్నారు. విశాఖపట్నాన్ని కాపాడుకునేందుకు సిఐటియు జాతీయ మహాసభలో ప్రతిపాదన చేయాలని కోరారు. సినిమా అనేది ఆనందం, ఆటపాటల కోసం మాత్రమే కాకుండా స్థానిక ప్రజలను చైతన్యవంతులు చేసేందుకు ఉపయోగపడుతుందన్నారు. తాను సినీ పరిశ్రమలో కార్మికుల హక్కుల కోసం పనిచేస్తున్నానన్నారు. సినిమా అనేది లక్షల మందికి చేరే ఒక ప్రధాన సాధనమని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ స్త్రీ-పురుష సమానత్వం, కార్మిక-కర్షక ఐక్యత, లౌకిక విలువల కోసం ఈ నెల 27 నుంచి శ్రామిక ఉత్సవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా, దేశంలోని 40 శాతం సంపద కేవలం ఒక శాతం మంది వ్యక్తుల వద్దే పేరుకుపోయిందని ఆమె విమర్శించారు. న్యాయస్థానాలు ఆదేశిస్తున్నా 'సమాన పనికి సమాన వేతనం' అమలు కావడం లేదని, స్కీమ్ వర్కర్ల శ్రమను పాలకులు దోచుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో సరైన ఆహారం అందక ప్రతిరోజూ 8 లక్షల మంది చిన్నారులు మరణిస్తుండటం శోచనీయమన్నారు. గుజరాత్ హైకోర్టు సూచించిన విధంగా కనీస వేతనం రూ.24,800 అమలు చేయాలని ఆమె డిమాండ్ చేశారు. కేరళను పేదరికం లేని రాష్ట్రంగా నీతి ఆయోగ్ ప్రకటించడం వామపక్ష ప్రభుత్వ సమర్థతకు నిదర్శనమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ద్రవిడ యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ కెఎస్.చలం, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు అజయ్ కుమార్, జిల్లా కోశాధికారి జ్యోతీశ్వరరావు, శ్రామిక ఉత్సవ్ కన్వీనర్ రమాదేవి, పెద్ద సంఖ్యలో కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు.

మహాసభ ప్రాంగణంలోని కళాకృతులు

కార్మికులకు అండ... సిఐటియు జెండా

విజయనగరం జిల్లాలో సిఐటియు కార్మికులకు అండగా నిలుస్తోంది. 1977లో ఏర్పాటై క్రమక్రమంగా విస్తరించిన సిఐటియు.. నేడు జిల్లాలో బలమైన కార్మిక సంఘంగా ఎదిగింది. జ్యూట్, రైస్ మిల్లులు, ఫెర్రో ఎల్లాయిస్, చక్కెర ఫ్యాక్టరీలు, ఆయిల్‌మిల్లుల కార్మికులతోపాటు విఆర్ఎ, విఆర్ఒ, పారిశుధ్య కార్మికులు, స్కీమ్‌వర్కర్లయిన అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం కార్మికులు... ఇలా ఒకటా రెండా అనేక రంగాల్లోని కార్మికులంతా సిఐటియులో చేరి తమ హక్కుల సాధనకు, సమస్యల పరిష్కారానికి పోరాటాలు చేస్తున్నారు. 1977లోనే విజయనగరం జిల్లాలో సిఐటియు ఏర్పాటుకు బీజాలు పడ్డాయి. క్రమక్రమంగా వివిధ రంగాలకు విస్తరించి 1991లో బొబ్బిలిలో సిఐటియు జిల్లా ప్రథమ మహాసభ నిర్వహించుకుంది. అప్పటి నుంచి వెనుతిరగకుండా కార్మికుల పక్షాన నికరంగా నిలబడి సమరశీల పోరాటాలు నిర్వహిస్తోంది.

లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా విజయనగరం కలెక్టరేట్ ఎదుట సిఐటియు ఆధ్వర్యాన ఆందోళన చేస్తున్న కార్మికులు (ఫైల్)

విశాఖ జిల్లాలో విజయనగరం రెవెన్యూ డివిజన్‌లో భాగంగానే నెల్లిమర్ల జ్యూట్ మిల్లును బ్రిటిష్ వారే నిర్మించారు. బ్రిటిష్ పెట్టుబడిదారులే ఈస్టుకోస్టు జ్యూట్ మిల్లు కూడా నిర్మించారు. క్రమంగా అరుణ, బొబ్బిలిలో గోపాలకృష్ణ, కొత్తవలసలో ఉమా, సాలూరులో జీగిరాం జ్యూట్ మిల్లులు నిర్మాణం జరిగింది. కార్మిక సంఘాల నిర్మాణం విషయంలో యజమాని, ప్రభుత్వం నిర్బంధాన్ని ఎదుర్కొని కార్మికులు తీవ్రంగా పోరాడారు. క్రమంగా గరివిడి ప్రాంతంలో మైనింగ్‌తోపాటు ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీ, బొబ్బిలి, సీతానగరంలో రెండు చక్కెర ఫ్యాక్టరీలు ఏర్పడ్డాయి. విజయనగరం, బొబ్బిలి, సాలూరు, పార్వతీపురం మున్సిపాలిటీల్లో మున్సిపల్ కార్మికులు, గర్భాంలో ఆయిల్ మిల్లులు, రైస్ మిల్లుల కార్మికులు.. సంఘాలు ఏర్పాటు చేసుకునేందుకు యజమానికి తెలిస్తే ఉద్యోగానికే ముప్పు కనుక అతి రహస్యంగా అష్టకష్టాలు పడ్డారు. ఇదో సుదీర్ఘ చరిత్ర.

1975 ఎమర్జెన్సీ అనంతరం 1977 ఎన్నికల తరువాత పశ్చిమ బెంగాల్లో సిపిఎం నాయకత్వంలో వామపక్ష ప్రభుత్వం ఏర్పడటం, బెంగాల్‌లోని జ్యూట్‌మిల్లులో సిఐటియు బలంగా ఉండటంతో చిట్టివలస, నెల్లిమర్ల, అరుణ, ఈస్ట్ కోస్టు, ఉమా జ్యూట్ మిల్లుల్లో కార్మికులు సిఐటియులో చేరారు. ఫలితంగా వీటన్నింటిలోనూ నాయకత్వంలోకి వచ్చారు. కార్మిక సమ్మె పోరాటాలు, బెంగాల్‌లో జ్యోతిబసు ప్రభుత్వం సహకారంతో మంచి ఒప్పందాలు జరిగాయి. వీటికి ప్రత్యక్ష నాయకత్వం ఎస్.గంగాధర రెడ్డి, దారా బూచి వహించారు. అనంతరం ఈ మిల్లులన్నీ ఐఎఫ్‌టియు నాయకత్వంలోకి వెళ్లడం, అనేక సార్లు అక్రమ లాకౌట్లు జరగడం, ఆ క్రమంలోనే నెల్లిమర్లలో జ్యూట్‌మిల్లు కార్మికులు చేపట్టిన రైలురోకోలో భాగంగా 1994 జనవరి 29న పోలీసు కాల్పుల్లో ఐదుగురు కార్మికులు మరణించారు.

బిహెచ్‌పివి సిఐటియు నాయకుడు జి.సుబ్బారావు చొరవతో స్వామినాయుడు సహకారంతో 1989లో సాలూరు ఫిలడెల్ఫియా ఆసుపత్రిలో సిఐటియు అనుబంధ సంఘం ఏర్పాటు చేయడం, నాయకత్వం వహిస్తున్న కామ్రేడ్‌ను తొలగించడం, న్యాయస్థానంలో గెలుపొందడం జరిగింది. జీగిరాం జ్యూట్ మిల్లు, సాలూరు మున్సిపల్ వర్కర్స్, సివిల్ సప్లై కళాసీలు, మినీ మోటార్ వర్కర్స్‌లోకి సిఐటియు విస్తరించింది.

1990లో బొబ్బిలి గోపాలకృష్ణ జ్యూట్‌మిల్లులో సిఐటియు అనుబంధ సంఘం పెట్టి అనేక పోరాటాలు చేశారు. జ్యూట్‌మిల్లు 13 నెలల అక్రమ లాకౌట్‌పై వీరోచిత పోరాటం చేసి విజయం సాధించారు. బొబ్బిలిలో హోటల్, ప్రెస్‌వర్కర్స్, బొబ్బిలి, సీతానగరం చక్కెర ఫ్యాక్టరీలకు, మున్సిపల్ వర్కర్స్‌లోకి విస్తరించింది. అనంతరం నవ్య, జ్యోతి జ్యూట్ మిల్లులు, గ్రోత్ సెంటర్‌లో ఫ్యాక్టరీలకు, బొబ్బిలి నుంచి బలిజిపేట రైస్‌మిల్లుల కళాసీలకు సంఘం విస్తరించింది.

పార్వతీపురం రైస్ మిల్లుల కళాసీలు, షాపు ఎంప్లాయిస్, మోటార్ వర్కర్స్‌కు, ఎఫ్‌సిఐ కళాసీల్లోకి, హోటల్, ప్రెస్, మున్సిపల్ వర్కర్స్‌లోకి, సినీ వర్కర్స్, గరుగుబిల్లి రైస్ మిల్స్ కళాసీ సంఘంలోకి, గుమ్మలక్ష్మీపురం లైజాన్ వర్కర్స్, కురుపాం, గుమ్మలక్ష్మీపురం జిసిసి కళాసీలకు సిఐటియు క్రమంగా విస్తరించింది. కార్మికులంతా సిఐటియు గొడుగు కిందకు వచ్చారు. ఇదే కాలంలో కొత్తవలస ప్రాంతంలో ఆంధ్రా ఫెర్రో, పెంకుల మిల్లుల్లో సిఐటియు అనుబంధ సంఘాలు ఏర్పాటై సమరశీల పోరాటాలు చేపట్టడం ద్వారా మంచి అగ్రిమెంట్లు జరిగాయి. పెంకుల మిల్లులో కార్మికులు సమ్మె చేస్తుండగా యజమాని కొత్త కార్మికులతో పని ప్రారంభించారు. దీంతో కార్మికులు ఆ యజమానిని కొడుతూ కిలోమీటర్లు మేర నడిపించి తగిన శాస్తి చేశారు. ఇంకా అనేక సంఘాలకు సిఐటియు విస్తరించి కొత్తవలస ప్రాంతంలో సమరశీల సంఘంగా నిలిచింది.

ఇదే కాలంలో విజయనగరంలో షాపు ఎంప్లాయిస్ యూనియన్ ఏర్పడింది. బొమ్మన, చందన షాపుల్లో సంఘం బలంగా నిలబడి పెద్ద సమ్మె, పోరాటాలు చేసింది. బొమ్మన బ్రదర్స్ బట్టల షాపులో 90 రోజులు సమ్మె చేసి కనీస వేతనం అమలు చేయించింది. చందనలో కూడా కనీస వేతనాలు అమలు చేయించింది. ఇది చారిత్రక విజయమే. స్పాన్ పైపుల కంపెనీకి తరువాత అరుణ, ఈస్ట్ కోస్ట్ జ్యూట్ మిల్లులకు, మున్సిపల్ వర్కర్స్‌లోకి సిఐటియు విస్తరించింది. మున్సిపల్ వర్కర్స్, ముఠా కళాసీలు, జిసిసి ఎంప్లాయిస్‌లోకి, భీమసింగి షుగర్ ఫ్యాక్టరీ, పూసపాటిరేగ వెరా కంపెనీకి, హెచ్‌బిఎల్ కార్మికుల్లోకి విస్తరించింది. వెరా లేబోరేటరీస్‌లో సమ్మె చేసి మంచి ఒప్పందం చేసింది. హెచ్‌బిఎల్‌లో వీరోచిత పోరాటం జరిగింది. అక్కడ నుంచి విజయనగర బయోటెక్‌కూ విస్తరించింది.

1995 తరువాత గరివిడి ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీలో సిఐటియు అనుబంధ సంఘం పెట్టడం, అక్కడి నుంచి డిఫైన్ మైనింగ్ కంపెనీకి, గర్భాం ఆయిల్, చీపురుపల్లి రైస్ మిల్లులకు విస్తరించింది. ప్రెస్ వర్కర్స్ సంఘం, చీపురుపల్లి వైర్ యూనిట్‌కు విస్తరించింది. గర్భాం ఆయిల్ మిల్లులో సమ్మె, సమరశీల పోరాటం జరిగాయి. ఫేకర్ అక్రమ లాకౌట్‌కు వ్యతిరేకంగా దాదాపు 6 నెలలు సమరశీల పోరాటాలు చేపట్టింది. ఆ పోరాట ప్రభావంతో స్థానిక ఎన్నికల్లో సిపిఎం తరపున కార్మికులే అభ్యర్థిని నిలబెట్టి గెలిపించారు.

మెడికల్ అండ్ హెల్త్‌లో ఇక్కడ నుండే పోరాటం ప్రారంభించి రాష్ట్ర సంఘం నిర్మాణానికి కృషి చేసింది సిఐటియు. రెండో ఎఎన్ఎంల నియామకాల కోసం వీరోచితంగా పోరాడింది. ఫలితంగా జిల్లా ఎన్‌జిఒల్లో బలంగా నిలబడింది. ఆర్‌టిసి, విద్యుత్, అంగన్వాడీ, ఆశా సమస్యలు, మధ్యాహ్న భోజనం కార్మికులు ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వేలాది మందితో పోరాటాలు నిర్వహించింది.

1991లో బొబ్బిలిలో సిఐటియు ప్రథమ జిల్లా మహాసభ జరిగింది. రాష్ట్ర కేంద్రం నుంచి శ్రీహరి హాజరయ్యారు. సిఐటియు విస్తరణలో వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ స్టడీ సర్కిల్ ముఖ్యపాత్ర పోషించింది. ఎల్ఐసి ఉద్యోగులు సిఐటియు అభివృద్ధిలో వెన్నుదన్నుగా నిలిచారు. నాటి నుంచి నేటివరకు జిల్లాలోని అన్ని రంగాల్లోనూ సిఐటియు కార్మికులతో పెనవేసుకుపోయింది.

ఈ క్రమంలో కార్మికులు తమ సమస్యలు పరిష్కరించుకునేందుకు, హక్కులను పరిరక్షించుకునేందుకు ఎన్నో బెదిరింపులు, నిర్బంధాలు ఎదుర్కొన్నారు. మరిన్ని సమస్యలు పరిష్కరించుకుని యాజమాన్యాల మెడలు వంచారు. కొన్ని దశాబ్దాలుగా జిల్లాలో ప్రధానమైన జ్యూట్, ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు మూతపడటం వల్ల జిల్లా పారిశ్రామికంగా మరింత వెనుకబడింది. ఈస్ట్‌కోస్ట్, అరుణ, బొబ్బిలి గోపాలకృష్ణ, జ్యోతి జ్యూట్ మిల్లులు మరికొన్ని పరిశ్రమల స్థలాలు రియల్ ఎస్టేట్ వెంచర్లుగా మారిపోయాయి. ప్రస్తుతం నడుస్తున్న జ్యూట్ పరిశ్రమలు గానీ, ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీలు గానీ పూర్తి సామర్థ్యంతో నడవడం లేదు. శాశ్వతంగా మూసివేసిన నాలుగు జ్యూట్‌మిల్లుల్లో 10 వేల మంది కార్మికులకు, ప్రస్తుతం ఉన్న మిల్లుల్లో పూర్తి సామర్థ్యంతో నడవకపోవడం వల్ల 5 వేల మందికి ఉపాధి పోయింది. మొత్తంగా పరిశీలిస్తే పారిశ్రామిక రంగంలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 20 వేల మంది కార్మికులు శాశ్వతంగా ఉపాధి దూరమయ్యారు. ఈ ప్రభావం విజయనగరం, గరివిడి, కొత్తవలస, బొబ్బిలి ప్రాంతాల్లో ఎక్కువగా కనిపిస్తోంది. పారిశ్రామిక సంక్షోభాన్ని అధిగమించి జిల్లాలో నిలదొక్కుకుంటున్న మైలాన్, హెబిఎల్, సిపి ఆక్వా, ఎస్ఎంఎస్, విజయనగర్ బయోటెక్ పరిశ్రమలతో పాటు హేచరీస్, పౌల్ట్రీస్ తదితర పరిశ్రమల్లో కార్మికులు రకరకాల సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఆ రంగం, ఈ రంగం కాదు.., అన్ని రంగాల్లోనూ కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు రెండో ఎఎన్ఎం, విఆర్ఎలు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన తదితర స్కీమ్ వర్కర్ల సమస్యలైతే అన్నీ ఇన్నీ కావు. ప్రభుత్వం అవలంభిస్తున్న మోసపూరిత విధానం వల్ల ఉద్యోగ భద్రత లేదు. పనికి తగ్గ వేతనం లేదు. పని ఒత్తిడి ఎక్కువైంది. బండెడు చాకిరీ చేస్తున్నా రాజకీయ వేధింపులు తప్పడం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో వీరందరికీ సిఐటియు అండగా నిలుస్తూ సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తోంది. ముఖ్యంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వల్ల జరుగుతున్న కష్టనష్టాలను కార్మికవర్గానికి వివరిస్తూ, చైతన్య పరుస్తూనే సమస్యల పరిష్కారానికి ఉద్యమాలను తీవ్రతరం చేస్తోంది.

- ఎం.కృష్ణమూర్తి
సిఐటియు పూర్వ సీనియర్ నాయకులు

సాహిత్యం.. జీవితాన్ని ప్రతిబింబించాలి

ప్రజాశక్తి-గాజువాక

జీవితాన్ని ప్రతిబింబించేలా సాహిత్యం రావాలని కథా రచయిత్రి కత్తి పద్మ అభిలాషించారు. శ్రామిక ఉత్సవ్ జరుగుతున్న సాహితీ వేదికపై 'సాహిత్యంలో దళిత, ఆదివాసీ, మహిళ ఆవరణాలు' అనే అంశంపై బుధవారం జరిగిన సభలో ఆమె మాట్లాడారు. ఉత్తరాంధ్ర నైసర్గిక స్వరూపం చాలా గొప్పదన్నారు. సముద్రం, కొండలు, మైదాన ప్రాంతాలు, దళితులు, ఆదివాసీలు నివసించే ప్రాంతమని అన్నారు. విశాఖ నగరంలో అనేక మురికి వాడలు ఉన్నాయని చెప్పారు. ఇందులో మత్స్యకార గ్రామం జాలారిపేట ఉందన్నారు. ఈ జాలారిపేటలో మహిళలకు ఆర్థిక స్వావలంబన ఎక్కువని, ఆర్థిక స్వేచ్ఛ కూడా ఉంటుందని వివరించారు. వీరి వివాహ వ్యవస్థ కూడా చాలా గొప్పదని తెలిపారు. ఇంతవరకు

సాహిత్య సభలో మాట్లాడుతున్న కథా రచయిత్రి కత్తి పద్మ

వరకట్న హత్యలు జరగని ప్రాంతంగా చెప్పుకొచ్చారు. దీన్ని సాహిత్య ఆవరణలోకి తీసుకురావల్సి ఉందని అభిప్రాయపడ్డారు. విశాఖలో ఉన్న మురికివాడను తొలగించాలని ప్రభుత్వాలు చేసిన ప్రయత్నానికి అప్పుడు చేసిన తీవ్రమైన పోరాటాలు, ప్రతిఘటనలు కూడా సాహిత్య ఆవరణలోకి ఎంచుకోవాలని కోరారు. అప్పుడే వాస్తవ సాహిత్యం వస్తుందన్నారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులు ప్రయివేటీకరణ వల్ల నష్టపోయిన అంశాలు,

కథా రచయిత్రి కత్తి పద్మ

కార్మికుల కుటుంబాల్లో మహిళలు, వారి పిల్లలు ఆ పోరాటంపై ఏమనుకుంటున్నారో సాహిత్యం ద్వారా వెలుగులోకి తేవాలని సూచించారు.

ఉత్తరాంధ్రలో సోంపేట పోరాటం తెగువ చూపించిందని గుర్తుచేశారు. ఆ పోరాటం పాలకులకు బుద్ధి చెప్పిందన్నారు. దాన్ని సాహిత్యంలోకి ప్రతిపాదించాలన్నారు. ఆదివాసీల్లో ఆహార సేకరణ ఎక్కువగా మహిళలపై ఆధారపడి ఉంటుందన్నారు. ఆదివాసీల సంస్కృతి చాలా గొప్పదని, దాన్ని పట్టుకోవాలని కోరారు. ఆదివాసీల్లో అద్భుతమైన జీవన సౌందర్యం దాగి ఉందని వివరించారు. ఈ సమాజంలో ప్రధాన సమస్యలు ఉన్నాయని, వాటిపై చర్చ జరగాల్సి ఉందని చెప్పారు. తక్షణ సమస్యలపై ఏవిధంగా పోరాటం చేస్తామో, అదేవిధంగా సాహిత్యంపైన, కళారంగంపైన, మేధావులు, కవులు కదలాలని పిలుపునిచ్చారు.

కవి కంచరాన భుజంగరావు మాట్లాడుతూ సాహిత్యంలో స్త్రీవాద, దళితవాద, ఆదివాసీ సాహిత్య పాయలు చాలా కొత్త అంశాలను వస్తువులుగా సేకరించాయన్నారు. ప్రొఫెసర్ కెఎస్ చలం మాట్లాడుతూ అస్తిత్వంలో అనే భావనలలో చాలా సమస్యలు ఉన్నాయన్నారు. సంఘటితంగా విముక్తికై కదలాల్సి ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా భుజంగరావు పూరేడు పిట్ట అనే కవితను వినిపించారు. మతం అనేది మనలో లేదని కవితను పాణిగ్రహి పాడి వినిపించారు. అనంతరం వీరికి సర్టిఫికెట్లు, మెమోంటోలను నిర్వాహకులు అందజేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నరేంద్రశర్మ (ఫైల్)

ప్రజాశక్తి- రణస్థలం

జె.ఆర్.పురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని 16వ నంబరు జాతీయ రహదారి స్థానిక సూర్యా స్కూల్ ఎదురుగా బుధవారం సంభవించిన రోడ్డు ప్రమాదంలో రణస్థలానికి చెందిన రావూరి నరేంద్ర శర్మ (53) మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పైడిభీమవరం పారిశ్రామిక వాడలోని ఆంధ్రా ఆర్గానిక్స్ పరిశ్రమలో సెక్యూరిటీ సూపర్ వైజర్‌గా పనిచేస్తున్నారు. పరిశ్రమలో మంగళవారం రాత్రి డ్యూటీ చేసుకుని బుధవారం ఉదయం పైడిభీమవరం నుంచి రణస్థలం బైక్‌పై వస్తున్నారు. వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడి ఘటనాస్థలంలోనే మృత్యువాత పడ్డారు. మృతునికి భార్య, కుమార్తె ఉన్నారు. కుమార్తె రావూరి విశ్వంజి ఇచ్చిన ఫిర్యాదు ఎస్‌ఐ చిరంజీవి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని జిల్లా సర్వజనాస్పత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు.

చెక్కును అందజేస్తున్న ప్రమీల

సిఎం సహాయనిధి చెక్కు పంపిణీ

ప్రజాశక్తి- పొందూరు

మండలంలోని పలు గ్రామాల్లో ఇటీవల అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న పలువురి కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను బుధవారం ఎమ్మెల్యే కూన రవికుమార్ సతీమణి, మాజీ ఎంపిపి కూన ప్రమీల పంపిణీ చేశారు. మండలంలోని బురిడికంచరాం గ్రామానికి చెందిన సెగ్గ రాముకు రూ.23,795లు, సైలాడ లక్ష్మికి రూ.32,515లు, బాలి శ్రీరాములుకు రూ.23,314లు, కంచరాన రజనీకు రూ.30 వేలు చెక్కులను అందజేశారు. అలాగే ధర్మపురానికి చెందిన మొదలవలస గోవిందరావుకు రూ.25,424లు, అలాగే వావిలపల్లిపేటకు చెందిన పైడి కృష్ణారావుకు రూ.20,241ల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు చిగులపల్లి రామ్మోహన్, పిఎసిఎస్ ఛైర్మన్ వండాన మురళి తదితరులు పాల్గొన్నారు.

నేడు పాఠశాలలకు ఒహెచ్

టెక్కలి : ప్రభుత్వ ఆదీనంలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు గురువారం నూతన సంవత్సరం సందర్భంగా ఐచ్చిక సెలవును ప్రకటిస్తూ... రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు ఆదేశాలు జారీ చేశారు. గతంలో విద్యాశాఖ కేటాయించే ఐచ్చిక సెలవు వినియోగంలో పాఠశాల మూతబడేది. నిబంధనలు మారడంతో ఐచ్చిక సెలవు రోజూ పాఠశాల పనిదినంగా విద్యాశాఖ భావించింది. దీంతో ఐచ్చిక సెలవు వినియోగం ఉపాధ్యాయులకే పరిమితమైంది. అయితే గురువారం వినియోగించుకునే ఐచ్చిక సెలవు రోజు పాఠశాల మూతబడినా పర్వాలేదు అనే స్పష్టత నిచ్చింది. దీంతో చాలావరకు పాఠశాలలు ఐచ్చిక సెలవుని వినియోగించుకోనున్నాయి. పదో తరగత విద్యార్థులకు అమలవుతున్న వంద రోజుల ప్రణాళిక అమలులో భాగంగా గురువారం నాటి పరీక్ష శుక్రవారం ఉదయం నిర్వహించుకునే విధంగా చర్యలు తీసుకున్నారు.

విద్యార్థులకు అందనంత దూరంలో...

ఖాళీగా దర్శనమిస్తున్న డిఇ, జెఇ కుర్చీలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు దూర నిర్దేశిత ధ్రువపత్రాల కోసం రోడ్లు భవనాల శాఖ (ఆర్‌అండ్‌బి) కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. కానీ, ఆ శాఖ అధికారులు అందుబాటులో ఉండడం లేదని పలువురు విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పట్టణానికి సుదూర ప్రాంతమైన చింతాడ వద్ద ఉన్న ఆర్‌అండ్‌బి కార్యాలయాన్ని, విద్యార్థుల వ్యయ ప్రయాసలను దృష్టిలో ఉంచుకుని కూటమి ప్రభుత్వం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణానికి తరలించారు. అయితే ఆ శాఖ సేవలు మాత్రం మెరుగుపడలేదని విద్యార్థులు, ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా మండలంలోని పలు గ్రామాల్లో కల్వర్టులు శిథిలావస్థకు చేరుకొని రహదారిపై నీరు ప్రవహించడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయమై రోడ్లు భవనాల శాఖ డిఇ, జెఇలకు ఫిర్యాదు చేసేందుకు కార్యాలయానికి వస్తున్నారు. ఎప్పుడు వచ్చినా ఖాళీ కుర్చీలే దర్శనమిస్తున్నాయని ఫిర్యాదుదారులు వాపోతున్నారు. రవాణాశాఖ డిఇ గణపతిరావు గతంలో ఎస్ఎస్ఎ ఇన్‌ఛార్జి డిఇగా పనిచేసేవారు. ఇటీవల ఆ బాధ్యతల నుంచి తప్పించినా ఆయన కార్యాలయంలో అందుబాటులో ఉండడం లేదని పలువురు పేర్కొంటున్నారు. ఫోన్‌లో ఆర్‌అండ్‌బి డిఇను సంప్రదిస్తే జిల్లా ఎస్ఇ డిపార్ట్‌మెంట్ పనులు అప్పగించడంతో ఆ పనుల్లో నిమగ్నమై ఉన్నామని సమాధానం ఇస్తున్నారని వారు వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఆర్‌అండ్‌బి అధికారులు ప్రజలకు విద్యార్థులకు అందుబాటులో ఉండేలా తగిన చర్యలు తీసుకోవాలని పలువురు ముక్తకంఠంతో కోరుతున్నారు.

విలువలతో కూడిన విద్య అవసరం

ప్రజాశక్తి- కవిటి

చదువుకునే దశలో ఆకర్షణకు లోనుకాకుండా విలువలతో కూడిన విద్య నేర్చుకోవాలని జనసేన పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ లోల్ల రాజేష్, ఎస్‌విజె విద్యా సంస్థల కరస్పాండెంట్ బెందాళం కింగ్ అన్నారు. కవిటి కళ్యాణి కళాశాల వీడ్కోలు వేడుకలు, ఎస్‌విజె విద్యాసంస్థల 29వ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాజేష్, కింగ్ మాట్లాడుతూ సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ కుటుంబ సభ్యుల ఆశలు నెరవేర్చాలని సూచించారు. భవిష్యత్‌లో మీకు గుర్తింపు తెచ్చేది చదువేనని, దానికి ఇప్పటి నుంచే బాటలు వేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎస్‌విజె మేనేజ్‌మెంట్ బి.యూస్నీ, కల్యాణి కళాశాల ప్రిన్సిపాల్ బైపిల్లి శంకరరావు, ఎస్‌విజె ప్రిన్సిపాళ్లు ఎం.భాస్కరరావు, జె.సంగీత తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న రాజేష్

కౌన్సిల్‌లో సభ్యుల ధ్వజం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

మున్సిపాలిటీ పరిధిలోని షాపింగ్ కాంప్లెక్స్‌లో షాపులు లీజుదారుల అద్దె బకాయిలు రూ.లక్షల వరకు వసులు చేయడంపై సిబ్బంది నిర్లక్ష్యం కనిపిస్తుందని సభ్యులు ధ్వజమెత్తారు. మున్సిపల్ కార్యాలయంలో ఛైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి అధ్యక్షతన బుధవారం కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం, యు కాంప్లెక్స్, పాత బస్టాండ్‌లో ఫస్ట్‌ఫ్లోర్‌లో ఉన్న షాపులు లీజుదారుల రూ.లక్షలు వరకు చెల్లించాల్సి ఉందని, ఎందుకు వసూలు చేయలేదని వైసిపి కౌన్సిల్ సభ్యులు బచ్చ జగన్ మండిపడ్డారు. మేనేజర్ అప్పలస్వామి స్పందిస్తూ... పలు దఫాలు వెళ్లామని, అలాగే నోటీసులు కూడా జారీ చేశామని తెలిపారు. ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ ఆఖరి అవకాశం నెల రోజుల ఇవ్వాలని, అప్పటికీ చెల్లించకపోతే చర్యలు తీసుకోవాలని కమిషనర్ రమేష్‌కు సూచించారు. పట్టణంలో చెరువులు లీజుకు ఇచ్చేందుకు తీర్మానించారు. సమావేశంలో వైస్ ఛైర్‌పర్సన్లు భారతీ దివ్య, లాభాల స్వర్ణమణి, కో-ఆప్షన్ సభ్యుడు ప్రత్తి విజయకుమార్ పాల్గొన్నారు.

ముగ్గురు అరెస్టు

నరసన్నపేట: ఇటీవల గ్రామాల్లో తిరుగుతూ తరుచూ ఆలయాల్లో దొంగతనాలకు పాల్పడే ముగ్గురు వ్యక్తులకు అరెస్టు చేసినట్లు సిఐ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. నరసన్నపేట సర్కిల్ కార్యాలయంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. చేవూరి శేఖర్, మోతి జీవరత్నం, చింతాడ మధులు ఊరూరా తిరుగుతూ స్క్రేప్ సామాన్లు కొంటూ అదే సమయంలో ఆలయాలను పరిశీలించేవారని తెలిపారు. రాత్రి సమయంలో ఆలయాల్లో దొంగతనాలు చేస్తుండేవారని వివరించారు. ఇందులో భాగంగా పోలాకి మండలంలో తెల్లవానిపేట, గుప్పిడిపేట, రెహమాన్‌పురం, శివరాంపురం, మబగాం ఆలయాల్లో దొంగతనాలు చేశారని చెప్పారు. అదేవిధంగా నౌపడ, సంతబొమ్మాళి, పలాస, నరసన్నపేట, సారవకోట తదితర గ్రామాల్లో కలిపి 28 గ్రాముల బంగారు శతమానాలు, 175 గ్రాముల వెండి వస్తువులు దొంగిలించారన్నారు. అలాగే మంగళవారం రాత్రి పోలాకి మండలం ఒనవిష్ణుపురం దొంగతనానికి వెళ్తుండగా... ఎస్ఐ రంజిత్ వెళ్లి పెట్టుకున్నట్లు తెలిపారు. వారి వద్ద నుంచి బంగారు శతమానాలు, వెండి వస్తువులు, రెండు బైక్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వారిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పోలాకి, సారవకోట ఎస్ఐలు పాల్గొన్నారు.

సత్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

మీ విజయం ప్రశంసనీయం

ప్రజాశక్తి- కవిటి

మార్వల్ ఆర్ట్స్‌లో కుసుంపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులు సాధించిన అద్భుత విజయం ప్రశంసనీయమని కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బార్ల చిన్నబాబు, మండల విద్యాశాఖ అధికారులు ధనంజయ మజ్జి, సనపల రామకృష్ణ అన్నారు. రాష్ట్రస్థాయి మార్వల్ ఆర్ట్స్ పోటీల్లో కుసుంపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ప్రతిభచాటారు. డిసెంబరు 28న శ్రీకాకుళంలో నిర్వహించిన పోటీల్లో లబ్బ శ్రావ్య గోల్డ్ మెడల్ సాధించగా, బొడ్డ అక్షిత్ సిల్వర్, కీలు రోషన్, కీలు లోకేష్, సందీప్‌లు బ్రాంజ్ మెడల్స్ కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన అభినందన సభలో వక్తలు మాట్లాడుతూ విద్యతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులు రాణించేలా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతిభ గల విద్యార్థులకు అన్ని విధాలా సహకారం అందిస్తామని తెలిపారు. అనంతరం విజేతలు, శిక్షకుడు సాయికిరణ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు పల్లి సాయిరాజ్, కాంప్లెక్స్ ఛైర్మన్ వైకుంఠరావు, విద్యా కమిటీ ఛైర్మన్ లబ్బ భారతి, ఉపాధ్యాయులు రాజబాబు, జగన్, చంద్రశేఖర్, సుజాత పాల్గొన్నారు.

కుళాయి నీటిని పరిశీలిస్తున్న కిరణ్‌కుమార్

కిరణ్‌కుమార్ విస్తృత పర్యటన

ప్రజాశక్తి- టెక్కలి

పట్టణంలోని సోగ్గాడిపేట, మండపాకాలనీ వంటి వెనుకబడిన ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పనకు అధికారులు దృష్టిసారించాల్సి ఉందని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి కణితి కిరణ్‌కుమార్ అన్నారు. ఈ మేరకు ఆయా ప్రాంతాల్లో బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులతో మమేకమై సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. పంచాయతీ పరిధిలో సరఫరా అవుతున్న తాగునీటి కుళాయిల నుంచి బురద నీరు వస్తుందని, చిన్నపాటి చెత్త, పురుగులు వంటివీ వస్తున్నాయని స్థానికులు తెలిపారు. పారిశుధ్య నివారణ అస్తవ్యస్తంగా ఉందని, కొన్ని ప్రాంతాలకే పరిశుభ్రత పరిమితమైపోతుందని అన్నారు. వెనుకబడిన ప్రాంతాలపై పంచాయతీ అధికారులు దృష్టి పెట్టడం లేదని తెలిపారు. దీనిపై కిరణ్‌కుమార్ స్పందిస్తూ... సమస్యల పరిష్కారానికి అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తామని తెలిపారు. ఈయనతో పాటు మామిడి నారాయణరావు, మహాలక్ష్మి, సోమేష్, ప్రదీప్ ఉన్నారు.

టిడిపి ఎస్‌సి సెల్ మండల అధ్యక్షునిగా 'చింతల'

సింహాచలం

కోటబొమ్మాళి: మండలంలోని కురుడు పంచాయతీ పాకివలసకు చెందిన చింతల సింహాచలం టిడిపి మండల విభాగం ఎస్‌సి సెల్ అధ్యక్షునిగా నియమించారు. ఈ మేరకు పార్టీ అధిష్ఠానం నుంచి ఉత్తర్వులు అందినట్లు ఆయన బుధవారం తెలిపారు. క్రమ శిక్షణ గల టిడిపి కార్యకర్తగా సేవలు అందించినందుకు ఈ పదవి ఆయనకు దక్కింది. నా పై నమ్మకంతో ఈ పదవిని కట్టబెట్టినందుకు కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎస్‌సికు ప్రభుత్వం నుంచి అందాల్సిన పథకాలు సంక్షేమ గా అందేటట్లు కృషి చేస్తానని తెలిపారు. అలాగే కళింగ వైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ బోయిన గోవిందరాజులు, పిఎసిఎస్ అధ్యక్షులు వెలమల విజయలక్ష్మి, ప్రతినిధి కామేశ్వరరావు, మాజీ ఎంపిపి తర్ర రామకృష్ణ, టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్, కురుడు పంచాయతీ టిడిపి నాయకులు నాళ్ల అదినారాయణ (చిన్ని)కు కృతజ్ఞతలు తెలిపారు.

3న అభ్యుదయం సైకిల్‌యాత్ర ముగింపు

ఇచ్ఛాపురం : ఈ నెల 3న ఇచ్ఛాపురంలో అభ్యుదయం సైకిల్ యాత్ర ముగింపు ఉంటుందని సిఐ మీసాల చిన్నంనాయుడు తెలిపారు. ఈ మేరకు బుధవారం విలేకరులతో మాట్లాడారు. పోలీస్‌స్టేషన్ వద్ద ఫైలాన్ ఆవిష్కరణ అనంతరం దాసన్నపేట వరకు సైకిల్‌యాత్ర చేపడుతున్నామని అన్నారు. తర్వాత రాజా క్రీడా మైదానంలో మత్తు పదార్థాల వినియోగం, అమ్మకాలు వల్లే కలిగే దుష్పలితాలపై యువతకు అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో పోలీస్ ఉన్నత అధికారులు పాల్గొంటారని తెలిపారు.

నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ మండలంలోని గాజుల కొల్లివలసకు చెందిన సైకతశిల్పి గేదెల హరికృష్ణ సంగమేశ్వర స్వామి కొండ దిగువన వేసిన సైకత శిల్పం పలువురిని ఆకట్టుకుంది. ఈ చిత్రాన్ని తిలకించిన చుట్టుపక్కల గ్రామాల ప్రజలు హరికృష్ణను అభినందించారు.

- ప్రజాశక్తి, ఆమదాలవలస

పేదలకు పింఛను భరోసా

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

పేదలకు భరోసా కల్పించే కార్యక్రమంలో భాగంగా స్వయంగా పాల్గొని పింఛన్లు అందజేయడం తనకు సంతృప్తినిస్తోందని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. కోటబొమ్మాళి మండలం ప్రకాష్‌నగర్ కాలనీలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జనవరి 1వ తేదీకి బదులు డిసెంబరు 31న, ముందుగానే పింఛన్లు పంపిణీ చేస్తూ కూటమి ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివరప్రసాద్, కళింగ వైశ్య కార్పొరేషన్ రాష్ట్ర అధ్యక్షులు బోయిన గోవిందరాజులు, పిఎసిఎస్ అధ్యక్షులు వెలమల విజయలక్ష్మి పాల్గొన్నారు. అలాగే నందిగామ మండలం దీనబంధుపురంలో 9 మందికి పింఛన్లను పంపిణీ చేశారు.

శ్రీకాకుళం సిటీ: వృద్ధాప్యంలో ఎటువంటి ఆధారం లేని వారికి ఎన్‌టిఆర్ భరోసా పింఛను కొండంత అండగా నిలుస్తున్నాయని మంత్రి అన్నారు. ఆదివారంపేటలో ఎమ్మెల్యే గొండు శంకర్, కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌లతో కలిసి లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో నగర కార్పొరేషన్ కమిషనర్ ప్రసాదరావు, డిఆర్‌డిఎ పిడి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నూతనంగా మంజూరైన కిడ్నీ బాధితులకు ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ప్రభాకరరావు, మండల యూత్ అధ్యక్షులు బోర యువరాజు, ఎంపిటిసి మాజీ సభ్యులు బోర ప్రసాద్ పాల్గొన్నారు.

కవిటి: ఇచ్ఛాపురం నియోజకవర్గంలో కొత్తగా మంజూరైన సికెడి, స్పౌజ్ పింఛన్లను రామయ్యపుట్టుగలోని క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్ అశోక్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ త్రినాధరావు, ఎఒ శ్రీనివాసరెడ్డి, టిడిపి మండల అధ్యక్షుడు పొందల కృష్ణారావు, నాయకులు బెందాళం రమేష్, బెందాళం తిరుమల కుమార్ పాల్గొన్నారు.

ఆమదాలవలస : మండలంలోని నెల్లిపర్తిలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను ఎమ్మెల్యే కూన రవికుమార్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ టిడిపి పరిశీలకులు టి.చంద్రశేఖర్ యాదవ్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు సనపల ఢిల్లీశ్వరరావు, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్, దేశిలంక రమణ, శెట్టి పద్మ పాల్గొన్నారు.

శ్రీకాకుళం సిటీ : పింఛను అందజేస్తున్న మంత్రి, కలెక్టర్, ఎమ్మెల్యే

శ్రీకాకుళం రూరల్ : మండలంలోని కిష్టప్పపేటలో ఎన్‌టిఆర్ సామాజిక పింఛన్లను ఎమ్మెల్యే గొండు శంకర్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ప్రకాశరావు, ఇఒపిఆర్‌డి కె.సూర్యనారాయణ పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని మాకనాపల్లిలో ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు సలాన మోహనరావు, తహశీల్దార్ బడే పాపారావు, ఎంపిడిఒ నరసింహ ప్రసాద్ పండా, సంబాల వెంకటరావు, అనపాన రాజశేఖరరెడ్డి, దినకర్, బొప్పు ప్రసాద్, పరమేశ్వర్‌రెడ్డి, తాడేల రామరాజు పాల్గొన్నారు.

లావేరు : మండలంలోని తాళ్లవలసలో టిడిపి రాష్ట్ర మహిళా కార్యదర్శి ముప్పిడి సుజాత, లావేరులో ఎఎంసి మాజీ చైర్మన్ యినపకుర్తి తోటయ్యదొర ఎన్‌టిఆర్ భరోసా సామాజిక పింఛన్లను పంపిణీ చేశారు.

నాగేశ్వరరావు కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

వెలుగు విఒఎగా విధులు నిర్వహిస్తూ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మెళియాపుట్టి మండలం పరశురాంపురానికి చెందిన సవర నాగేశ్వరరావు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని వెలుగు విఒఎల సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు అల్లు మహాలక్ష్మి, అధ్యక్ష, కార్యదర్శులు వి.ధనలక్ష్మి, జి.అశిరినాయుడు ఒక ప్రకటనలో కోరారు. నిరుపేద గిరిజన కుటుంబానికి చెందిన నాగేశ్వరరావుకు భార్య బోడెమ్మ, ఇద్దరు చిన్న పిల్లలు ఉన్నారని తెలిపారు. నాగేశ్వరరావు కుటుంబానికి రూ.20 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. మృతుని భార్యకు ఉద్యోగం ఇవ్వాలన్నారు. నిరంతరం ప్రభుత్వానికి, ప్రజలకు వారధిలా పనిచేస్తున్న విఒఎలకు సామాజిక భద్రత, ఇన్సూరెన్స్ సదుపాయం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విఒఎలకు రూ.20 లక్షలు ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించాలని కోరారు.

మలకాం చిన్నారి ప్రతిభ

ప్రజాశక్తి- పొందూరు

పతకంతో వేదసాయి

అస్సాం రాష్ట్రంలోని గౌహతిలో నిర్వహించిన 14వ నేషనల్ స్కూల్ చెస్ ఛాంపియన్ షిప్ పోటీల్లో మండలంలోని మలకాం గ్రామానికి చెందిన బస్వా వేదసాయి ప్రతిభ కనబరిచింది. ఈ పోటీలలో అండర్-7 విభాగంలో 7వ స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ పోటీలకు వివిధ రాష్ట్రాల నుంచి 42 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అందులో 7వ స్థానంలో నిలిచి తన ప్రతిభను కనబరిచింది. అంతకుముందు రాష్ట్రస్థాయిలో నిర్వహించిన స్కూల్ చెస్ ఛాంపియన్ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచి నేషనల్ పోటీలకు ఎంపికైంది. ప్రస్తుతం విజయనగరంలోని లివింగ్‌డాల్స్ స్కూల్‌లో వేదసాయి సెకెండ్ క్లాస్ చదువుతుంది. ఈమె ప్రతిభపై సర్పంచ్ జాడ శ్రీనివాసరావు, తల్లిదండ్రులు బస్వా విశ్వేశ్వరరావు, దేవికలు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తూ, అభినందనలు తెలిపారు.

తవిటయ్యను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

క్రీడాకారులకు అభినందనలు

పలాస : కేరళ రాష్ట్రం కాసరగాడ్ జిల్లా త్రిపురపూర్‌లో డిసెంబరు 22 నుంచి 26 వరకు నిర్వహించిన 37వ సబ్ జూనియర్ బాల బాలికల టెన్నికాయిట్ పోటీల్లో పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడాకారులు ప్రతిభకనబరిచారు. కోరికాన జయంత్ బాలుర టీమ్ ఛాంపియన్‌షిప్‌లో తృతీయ స్థానం, వ్యక్తిగత డబుల్స్‌లో తృతీయస్థానం, నెయ్యిల దివ్య బాలికల టీమ్ షిపియన్‌షిప్‌లో తృతీయ స్థానం, వ్యక్తిగత మిక్స్ డబుల్స్‌లో ద్వితీయ స్థానం సాధించారు. వీరికి బుధవారం పాఠశాలలో అభినందించి సన్మానించారు. వీరి విజయంలో కీలక పాత్ర పోషించిన రాష్ట్ర టెన్నికాయిట్ సంఘ ఉపాధ్యక్షుడు పి.తవిటయ్యను ఉపాధ్యాయులు సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి.రవికుమార్, క్రీడా ప్రోత్సాహకులు మల్లా భద్రయ్య, ఉపాధ్యాయులు ఆర్.రాజ్యలక్ష్మి, పి.కృష్ణారావు, ఆర్.సోమేశ్వరరావు, జిల్లా టెన్నికాయిట్ అసోసియేషన్ అధ్యక్షులు మల్లా సంతోష్‌కుమార్, కార్యదర్శి సూడియా వెంకట జోగారావు, పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు బి.శంకరరావు, ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేడు విగ్రహాల ఆవిష్కరణ

టెక్కలి : టెక్కలి విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనం ఆవరణలో నూతనంగా ఏర్పాటు చేసిన డి.ఎస్.నకారా, జస్టిస్ వై.వి.చంద్రచూడ్ విగ్రహాలను గురువారం ఆవిష్కరించనున్నట్లు ఆ సంఘ అధ్యక్షులు రోణంకి రామచంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.ఎస్.అబ్దుల్ కరీం సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ విగ్రహాలను కేంద్ర, రాష్ట్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, అచ్చెన్నాయుడులు ఆవిష్కరిస్తామని తెలిపారు.

సూపర్ సిక్స్ హిట్

ఎమ్మెల్యే గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తుందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. ఈ మేరకు బుధవారం విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని తెలిపారు. సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్, బిజెపి సహకారంతో రాష్ట్రం అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుందన్నారు. పలాస నియోజకవర్గంలో రూ.140 కోట్లతో సిసి రోడ్లు, కాలువలు నిర్మించామన్నారు. కాశీబుగ్గ కిడ్నీ ఆస్పత్రిలో నూతన పరికరాలు, యంత్రాలు తీసుకొచ్చామని చెప్పారు. ఇటీవల రూ.9 కోట్లు నిధులు మంజూరు చేశామన్నారు. పలు సంస్థ సౌజన్యంతో పది డయాలసిస్ యూనిట్లు ఏర్పాటు చేశామని తెలిపారు. కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సహకారంతో రైల్వే వంతెన పనులు ముమ్మరంగా సాగుతున్నాయని చెప్పారు. రెండేళ్ల నుంచి వంశధార నీటిని శివారు భూములకు అందిస్తున్నామని అన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

బహుమతులతో విద్యార్థులు

బివికె విద్యార్థుల ప్రతిభ

కవిటి: కవిటి రఘునాథ స్వామి ఆలయంలో నిర్వహించిన మండల స్థాయి భగవద్గీత పోటీల్లో బివికెర్ విజ్ఞాన్ భారతి జగతి పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. 6,7 తరగతుల విభాగంలో బి.హరిణి ద్వితీయ, బి.జ్ఞానద తృతీయ స్థానం సాధించగా, 3,4,5 తరగతుల విభాగంలో పి.జశిత ప్రథమ, పి.వైష్ణవి ద్వితీయ, బి.గౌతం తృతీయ స్థానాలు పొందారు. ఈ పోటీలకు ఉమామహేశ్వరరావు, బల్లెడ యజ్ఞానందం, బి.శాంతమూర్తి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించగా, విజేతలకు జిజె కాలేజ్ ప్రిన్సిపాల్ సింహాచలం నాయుడు, ఆరంగి రాజు, ఆరంగి రామ్‌కుమార్ బహుమతులు అందజేశారు.

పాస్ పుస్తకాలు పంపిణీకి సిద్ధం

లావేరు : ఈ నెల 2 నుంచి రీ సర్వే పూర్తయి గ్రామాల్లో రైతులకు ప్రభుత్వం ముద్రించిన పట్టదార్ పాస్ పుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నామని తహశీల్దార్ గురుగుబిల్లి ఈశ్వరశ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. 2న కొండకుంకం, పోతయ్యవలస, పేదలింగాలవలస, 3న గోవిందపురం, బెజ్జిణం, 5న సిగిరికొత్తపల్లి, సుభద్రపురం, వెంకటరావుపేట, కేశవరాయపురం, 6న బుడతవలస, నీలాపురం, 7న రావివలస, చీడ్రపాలెం, జి.జి.వలస, 8న వేణుగోపాలపురం, నాగాంపాలెం, సిహెచ్.అగ్రహారం, 9న లోపెంట గ్రామాల్లోని ఉదయం పది నుంచి సాయంత్రం 4 గంటల వరకు పట్టదార్ పాస్ పుస్తకాలు అందజేస్తున్నామని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పంచాయతీ స్థలాన్ని రిజిస్ట్రేషన్ చేయొద్దు

ప్రజాశక్తి- పొందూరు

లేఖను అందజేస్తున్న ఇఒ జగదీష్

పొందూరు పట్టణంలో కోట్ల విలువైన పంచాయతీ స్థలం అక్రమ రిజిస్ట్రేషన్‌ను బుధవారం ఇఒ పొన్నాడ జగదీష్ అడ్డుకునే ప్రయత్నం చేశారు. పొందూరు మండల పరిషత్ కార్యాలయానికి ఆనుకుని పంచాయతీకి చెందిన సోషల్‌క్లబ్ ఉంది. గత కొంతకాలంగా వాండ్రంగి పరిధిలోని ఎం.కృష్ణారావు, కొంతమంది ఆ భూమికి వారసులుగా చెప్పుకునే వారినుంచి కొనుగోలు చేసి రిజిస్ట్రేషన్ చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. రెవెన్యూ పంచాయతీ రికార్డుల్లో ఈ భూమి ప్రభుత్వ భూమిగా నమోదై ఉంది. దీనిపై ఇటీవల సర్పంచ్ రేగిడి లక్ష్మి ఫిర్యాదు మేరకు పంచాయతీ, రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అత్యంత విలువైన ఈ భూమి అన్ని రికార్డుల్లో ప్రభుత్వ భూమిగా ఉందని, ఈ భూమిని రిజిస్ట్రేషన్ చేస్తే జైలుకు వెళ్లాల్సిన ఉంటుందని రిజిస్ట్రేషన్ కార్యాలయం సిబ్బందిని ఆమె హెచ్చరించారు. అయితే పెండింగ్ రిజిస్ట్రేషన్ పేరుతో రిజిస్ట్రేషన్‌కు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం అందడంతో ఇఒ రిజిస్ట్రేషన్ ప్రక్రియను నిలుపుదల చేయాలంటూ సబ్ రిజిస్ట్రార్ ఎం.శివశంకర్ శేషుకు లేఖను అందజేశారు. ఈ భూమిని రిజిస్ట్రేషన్ చేస్తే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ముందు గ్రామస్తులు ధర్నా చేయడానికి సిద్ధంగా ఉన్నారని సర్పంచ్ లక్ష్మి తెలిపారు.

రోడ్డుపై అక్రమ నిర్మాణం

ప్రజాశక్తి- పలాస

కాశీబుగ్గ గాంధీ నగర్ లో మున్సిపల్ వీధి రోడ్డును ఆక్రమించి నిర్మాణం చేపడుతున్నామన్నారు. మున్సిపాలిటీలో చిన్న స్థలం కూడా కోట్లు విలువ చేయడంతో ప్రైవేటు వ్యక్తులు వీధి రోడ్డునూ విడిచిపెట్టడం లేదు. వీధి మధ్యలో నిర్మాణం చేపడుతున్న మున్సిపల్ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడంపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాశీబుగ్గ గాంధీ నగర్ మోర్ షాపింగ్ మాల్ నుంచి బమ్మిడి కృష్ణమూర్తి ఇంటి వరకు ఉన్న మున్సిపల్ వీధి రోడ్డు ఆక్రమణకు గురైంది. ప్రైవేటు వ్యక్తులు ఇష్టానుసారంగా సుమారు 144 చదరపు అడుగుల విస్తీర్ణంలో దుకాణం నిర్మాణం చేపట్టేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. చాలా నెలలు క్రితం నిర్మాణం చేపడితే అప్పటి మున్సిపల్ అధికారులు తొలగించారు. మరలా ప్రైవేటు వ్యక్తులు మున్సిపల్ వీధి రోడ్డు ఆక్రమించి రోడ్డు మధ్యలో నిర్మాణం చేపడుతున్న విషయం తెలిసినా ప్రస్తుత మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వీధి రోడ్డే కాకుండా విద్యుత్ స్తంభం ఆక్రమణ నిర్మాణంలో ఉంది. వీధి రోడ్డుపై ప్రైవేటు వ్యక్తులు నిర్మాణం చేపడుతున్నారని స్థానిక సూర్యతేజ కళాశాల యాజమాన్యం మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ప్రైవేటు వ్యక్తులు చేపడుతున్న నిర్మాణం పనులను గతంలో అడ్డుకున్నారు. ప్రైవేటు వ్యక్తులు, సూర్యతేజ కళాశాల యాజమాన్యం ఇరువురు మధ్య తగాదాలు కూడా జరిగాయి. చివరకు సిఎంఒ కార్యాలయానికి సూర్యతేజ కళాశాల యాజమాన్యం ఫిర్యాదు చేశారు. ఇంత జరుగుతున్నా ప్రైవేటు వ్యక్తులు వీధి రోడ్డుపై నిర్మాణం చేపట్టడంపై మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడమే కారణమని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ ఇ.శ్రీనివాసులును వివరణ కోరగా వీధి రోడ్డుపై ఆక్రమ నిర్మాణం చేపడుతున్న విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. తమ సిబ్బంది పరిశీలించారని, ఆక్రమ నిర్మాణం తొలగించాలని ప్రైవేటు వ్యక్తులకు సూచించామని తెలిపారు.

పునాది వేసిన ఆక్రమణదారుడు

రబీ పంటల యాజమాన్యంపై శిక్షణ

ప్రజాశక్తి- సంతబొమ్మాళి

మండలంలోని దండుగోపాలపురంలో ప్రధానమంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింద రబీ సీజన్‌కు సంబంధించి రైతులకు పూర్వ అభ్యాస గుర్తింపు శిక్షణా కార్యక్రమాన్ని జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యాన బుధవారం నిర్వహించారు. పెసర, మినుము, చోడి, మొక్కజొన్న, వరి పంటలలో మేలైన యాజమాన్య పద్ధతులు, ఎరువుల సమర్థ వినియోగం, పురుగు-తెగులు నియంత్రణ విధానాలపై రైతులకు శాస్త్రవేత్తలు విస్తృతంగా అవగాహన కల్పించారు. రైతులు ఎదుర్కొంటున్న సాగు సమస్యలను శాస్త్రీయంగా విశ్లేషించి తగిన పరిష్కారాలను సూచించారు. ఈ శిక్షణలో వ్యవసాయ పరిశోధన కేంద్రం, ఆమదాలవలస శాస్త్రవేత్త, హెడ్ డాక్టర్ జి.చిట్టిబాబు, జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి వై.సురేష్, మండల వ్యవసాయాధికారి ఆర్.అప్పారావు పాల్గొని రైతులకు మార్గదర్శనం చేశారు.

పలాస : మండలంలోని రాజగోపాలపురంలో ప్రధాన మంత్రి

సంతబొమ్మాళి : ప్రశంసాపత్రం అందజేస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకంలో బాగా జిల్లా వనరుల కేంద్రం రబీ సీజన్‌లో పంటలపై మేలైన యాజమాన్య పద్ధతులపై పూర్వ అభ్యాస గుర్తింపు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా వ్యవసాయ సహాయ సంచాలకులు సిహెచ్.వెంకటరావు, కృషి విజ్ఞాన్ కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్ మాట్లాడుతూ మొక్కజొన్నలో ఎరువుల యాజమాన్యం, కలుపు యాజమాన్యం, కత్తెర పురుగు నివారణకు సమగ్ర సస్యరక్షణ గురించి వివరించారు. నువ్వులు, వేరుశెనగ, వరి పంటల్లో ఎరువుల యాజమాన్యం, పురుగు, తెగులు యాజమాన్యం గురించి రైతులకు అవగాహన కల్పించారు. రైతులు ఎదుర్కొంటున్న సాగు సమస్యలకు శాస్త్రవేత్తలు పరిష్కారం మార్గాలను తెలిపారు. కార్యక్రమంలో ఎఒ కె.పోలారావు, విఎఎ రాజేష్ పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలం కోసమాలలో ప్రధాన మంత్రి రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింద జిల్లా వనరుల కేంద్రం, శ్రీకాకుళం ఆధ్వర్యంలో రైతులకు పూర్వాభ్యాస గుర్తింపు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ సహాయ సంచాలకులు వెంకటరావు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కిరణ్, ఎఒ ఎస్.దానకర్ణుడు, టిడిపి ప్రధాన కార్యదర్శి బొచ్చు ప్రసాదరావు, సర్పంచ్ రవికుమార్, కూటమి నాయకులు ఎస్.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

నగర అభివృద్ధే లక్ష్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

నగరంలోని ప్రతి వీధిలోనూ మౌలిక సదుపాయాలు కల్పించి, శ్రీకాకుళాన్ని సుందర నగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. నగరంలోని బలగచిట్టివారి తోట నుంచి బలగ రోడ్డు వరకు రూ.20 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును, అలాగే కుమ్మరి వీధి నుంచి పాలకొండ రోడ్డు వరకు రూ.1.23 కోట్ల సాధారణ నిధులతో నిర్మించిన బిటి రోడ్డును ఎమ్మెల్యే గొండు శంకర్‌తో కలిసి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రజలకు రవాణా సౌకర్యాలకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, నగర కార్పొరేషన్ కమిషనర్ ప్రసాదరావు పాల్గొన్నారు.

అర్హుల కళ్లలో ఆనందం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

కోటబొమ్మాళి పంచాయతీ పొందర వీధికి చెందిన 40 మంది అర్హులైన లబ్ధిదారుల కళ్లలో ఆనందాన్ని నింపామని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. సుమారు 50 ఏళ్లుగా భూములు సాగు చేస్తున్నా వారి పేర్లపై ఎలాంటి అధికారిక పత్రాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని లబ్ధిదారులు తన దృష్టికి తీసుకొచ్చారన్నారు. ఈ సమస్యను తక్షణమే పరిష్కరించాలని రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. అధికారులు సమగ్ర సర్వే నిర్వహించి, అర్హులైన లబ్ధిదారులను గుర్తించి వారికి 1బి భూమి పత్రాలను బుధవారం పంపిణీ చేశారు. త్వరలో వీరందరికీ పట్టాదర పాస్ పుస్తకాలు పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో టెక్కలి ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరివర ప్రసాద్, కళింగ వైశ్య కార్పొరేషన్ రాష్ట్ర అధ్యక్షులు బోయిన గోవిందరాజులు, పిఎసిఎస్ అధ్యక్షులు వెలమల విజయలక్ష్మి పాల్గొన్నారు.

పింఛను అందజేస్తున్న సత్యనారాయణ

వితంతు పింఛను పునరుద్ధరణ

ప్రజాశక్తి- పొందూరు

గత వైసిపి ప్రభుత్వంలో తొలగించిన వితంతు పింఛనును హైకోర్టు ఆదేశాలతో ఏరియర్స్‌తో సహా బాధితురాలకు బుధవారం అందజేశారు. మండలంలోని పెనుబర్తికి చెందిన సీపాన గోవిందమ్మ వితంతు పింఛనును వచ్చేది, కానీ, గత ప్రభుత్వం సాంకేతిక సమస్య చూపుతూ ఈమెకు 2021 ఏప్రిల్ నెలలో పింఛనును తొలగించారు. దీనిపై గోవిందమ్మతో పాటు ప్రస్తుత ఎమ్మెమల్యే కూన రవికుమార్ ఆమెకు అనుకూలంగా హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన అనంతరం గోవిందమ్మకు పింఛనును పునరుద్దరించాలని, అలాగే పింఛనును నిలిపివేసినప్పటి నుంచి 2024 నవంబరు వరకూ గల 44 నెలల ఏరియర్స్ మొత్తాన్ని అందించాలని అధికారులను హైకోర్టు ఆదేశించింది. దీంతో ఆ మొత్తం రూ.1,21,250లను బాధితురాలికి ఎమ్మెల్యే సోదరుడు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కూన వెంకటసత్యనారాయణ అందజేశారు. ఈయనతో పాటు కార్యదర్శి జనార్ధన్ పాల్గొన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న తహశీల్దార్ పాపారావు

ఆశ్రమ పాఠశాల సందర్శన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలోని బందపల్లి ఆశ్రమ పాఠశాలను తహశీల్దార్ బడే పాపారావు మంగళవారం అర్ధరాత్రి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులు చదుతున్న విద్యావిధానం, వారు తీసుకునే భోజనం, వసతి సౌకర్యాలు, నిర్వహణకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, మెరుగైన వసతి సదుపాయాలు అందేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. అలాగే పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ జగన్మోహనరావు, ఆర్ఐ ఆశ, విఆర్ఒ లలిత, దేవేంద్ర పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వారిని శిక్షించాలి

ప్రజాశక్తి - శ్రీకాకుళం సిటీ

శ్రీకాకుళం పట్టణంలో అంబేద్కర్ విగ్రహాన్ని పాక్షికంగా ధ్వంసం చేసిన వారిని తక్షణమే అరెస్టు చేయాలని దళిత జెఎసి సభ్యులు డిమాండ్ చేశారు. బలగలో నివాసం ఉంటున్న దళిత విద్యావంతుడు నూత లపాటిపై దాడి చేసిన వారిని శిక్షించాలన్నారు. శ్రీకాకుళం డిఎస్‌పి కార్యాలయంలో డిఎస్‌పి వివేకనందను కలిసి బుధవారం వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పోతల దుర్గారావు, గంజి ఎజ్రా, బైరి ధనరాజ్, రాయి సూర్యనారాయణ, మిస్కా కృష్ణయ్య, దండాసి జాన్ పాల్గొన్నారు.

డిఎస్‌పి కార్యాలయం ముందు దళిత సంఘం నాయకులు

ప్రణాళికతో మంచి ఫలితాలు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

బాలికలు దృఢ సంకల్పంతో, పక్కా ప్రణాళికతో దూసుకుపోతే మంచి ఫలితాలు సాధించవచ్చు అని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. స్థానిక బాలికల జూనియర్ కళాశాల బుధవారం నిర్వహించిన వార్షికోత్సవ వేడుకలో ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అద్భుతమైన ఫలితాలు సాధించిన మహిళలు అనేక మంది ఉన్నారని, చేయాలనే తపన ఉంటే మహిళాశక్తి సాధించలేనిది ఏది లేదని అన్నారు. విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని, అప్పుడే ఆ విద్యే మిమ్మల్ని ఉన్నత స్థానంలోకి తీసుకెళ్తుందని అన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పి.రాజ్యలక్ష్మి, వైస్

మాట్లాడుతున్న విప్ అశోక్

చైర్‌పర్సన్ భారతీ దివ్య, జనసేన ఇన్‌ఛార్జి దాసరి రాజు, కార్పొరేషన్ చైర్మన్ కొండ శంకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నవ్యశ్రీ మహంతి, బాలుర కళాశాల ప్రిన్సిపాల్ చింతాడ శరత్ బాబు, కమిషనర్ రమేష్, కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఎజిఎంఒ ప్రియ సుధాకర్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. అనంతరం బాలికల నృత్య ప్రదర్శన అందరినీ అలరించాయి.

ఆరోగ్యంగా జీవించాలి

సన్మానిస్తున్న ఎఎస్‌పిలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

ఉద్యోగ విరమణ పొందిన సబ్ ఇన్‌స్పెక్టర్ పి.వి.రమణ, హెడ్‌కానిస్టేబుల్ పి.త్రినాథరావు, హోంగార్డు కె.శంకరరావులు బుధవారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ మేరకు ఎస్‌పి కార్యాలయంలో అదనపు ఎస్‌పి కె.వి.రమణ సత్కరించి జ్ఞాపికలను అందజేసి అభినందించారు. పోలీసు శాఖలో అనేక సంవత్సరాల పాటు అంకితభావంతో సేవలందించి, విధి నిర్వహణలో నిజాయితీ, క్రమ శిక్షణతో ప్రజల మన్ననలు పొందిన ఉద్యోగ విరమణ పొందిన అధికారులు అభినందనీయులని తెలిపారు. వారి సేవలు పోలీసుశాఖకు ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొంటూ, ఉద్యోగ విరమణ అనంతరం కూడా ఆరోగ్యంగా, ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అదనపు ఎస్‌పి పి.శ్రీనివాసరావు, ఎఒ సిహెచ్.గోపినాథ్, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ సూర్య చంద్రమౌళి, డిసిఆర్‌బి ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, పోలీసు అసోసియేషన్ అధ్యక్షులు కృష్ణంనాయుడు, భుజంగరావు, అరుణకుమారి, జగదాంబ పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- సరుబుజ్జిలి

33/11 కెవి సరుబుజ్జిలి మండల ఉప కేంద్రంలో ఆర్‌డిఎస్‌ఎస్ పనుల్లో భాగంగా కొత్త బ్రేకర్ అమర్చేందుకు బే పొడిగింపు ఇతర మరమ్మతులు పూర్తి చేసేందుకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పైడి యోగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరుబుజ్జిలి, షళంత్రి, కొత్తకోట, రోట్టవలస, రావివలస, వెంకటాపురం, పాలవలస, పురుషోత్తపురం, అలమాజీపేట, కూనజమ్మన్నపేట, కాగితాపల్లి, యర్రగాం, తెలికిపెంట, సుబ్బపేట, పెద్దసవలాపురం, కొండ్రగూడ, వెన్నెలవలస, చిగురువలస, సూర్యనారాయణపురం, గోనెపాడు, బొప్పడాం గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని అన్నారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

బూర్జ : మండలంలోని కొల్లువలస పరిధిలో ఉన్న 33/11 కెవి సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆర్‌డిఎస్‌ఎస్ వర్క్, సబ్ స్టేషన్ మరమ్మతులు చేపట్టనున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని విద్యుత్ శాఖ ఎఇ బి.అప్పన్న తెలిపారు కొల్లివలస, ఉప్పినివలస, గుత్తావల్లి, లాభాం, కొరగాం, కాళపర్తి, కె.కె.రాజపురం, వనగోపీదేవిపేట, కాఖండ్యాం, అన్నంపేట, తోటవాడ గ్రామాలకు విద్యుత్ సరఫరా అంతరాయం ఏర్పడుతుందన్నారు.

అవగాహన కల్పిస్తున్న రాజేష్ కె.మహాన్

'ఉద్గం పోర్టల్'పై అవగాహన

ప్రజాశక్తి- పొందూరు

ఉద్గం పోర్టల్ గురించి బ్యాంకు ఖాతాదారులకు అవగాహన కల్పించాలని రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా జనరల్ మేనేజర్ రాజేష్ కె.మహాన్ అన్నారు. పొందూరు సిఎఫ్ఎల్ కార్యాలయాన్ని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా రెండేళ్లుగా లావాదేవీలు నిర్వహించని బ్యాంకు ఖాతాదారులు తమ వివరాలను ఉద్గం పోర్టల్‌లో నమోదు చేయడం ద్వారా తిరిగి బ్యాంకు ఖాతాను యాక్టివ్‌లోకి తీసుకురావడం ద్వారా తిరిగి లావాదేవీలను నిర్వహించుకోవచ్చుననే విషయాన్ని అవగాహన కల్పించాలని అన్నారు. అలాగే ఇటీవల చోటుచేసుకుంటున్న సైబర్ నేరాలు గురించి ఖాతాదారులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ఈయనతో పాటు జిల్లా లీడ్ బ్యాంకు మేనేజర్ పేడాడ శ్రీనివాసరావు, సిఎఫ్ఎల్‌లు డి.లక్ష్మణరావు, ఎం.రామారావులు ఉన్నారు.

బీజామృతం తయారీపై అవగాహన

కవిటి: మండలంలోని లండారిపుట్టుగ పంచాయతీ కొత్తపుట్టుగలో బుధవారం బీజామృతం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. ఆవుపేడ, ఆవుమూత్రంతో భీజామృతం తయారీ విధానాన్ని రైతులకు వివరించారు. 12 గంటల తర్వాత పేడను శుద్ధి చేస్తే భీజామృతం సిద్ధమవుతుందని తెలిపారు. దీనికి కొద్దిగా సున్నం కలిపి విత్తన, నారు శుద్ధికి ఉపయోగించవచ్చని, నిల్వ సామర్థ్యం లేకపోయినా విత్తనం, పొలాల్లో వచ్చే తెగుళ్ల నుంచి ఇది రక్షణ కల్పిస్తుందని ఎఫ్ఎంటి తులసయ్య చెప్పారు. కాయగూరలు, ఆకుకూరల విత్తనాలకూ ఇది ఉపయోగకరమ న్నారు. సిఆర్‌పిలు జయమ్మ, సంతోషి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్‌డిఒ కృష్ణమూర్తి

టెక్కలి డివిజన్‌లోకి నందిగాం

ప్రజాశక్తి- నందిగాం

నందిగాం మండలాన్ని పలాస రెవెన్యూ డివిజన్ నుంచి టెక్కలి రెవెన్యూ డివిజన్‌లోకి ప్రభుత్వం మార్పు చేసిందని ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి తెలిపారు. ఈ మేరకు తహశీల్దార్ పి.సోమేశ్వరరావుకు సంబంధిత పత్రాలను అందించారు. ఈ సందర్భంగా టిడిపి మండల అధ్యక్షులు పి.అజయ్ కుమార్, టిడిపి నాయకులు ఎం.బాలకృష్ణ మాట్లాడుతూ పలాస డివిజన్ నుంచి టెక్కలి మార్చడానికి కృషి చేసిన కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడకు కృతజ్ఞతలు తెలిపారు. పలాసలో ఉండడంతో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పి.చంద్రశేఖరరావు, ఎ.కూర్మారావు పాల్గొన్నారు.

నీలాదేవిపురంలో రీ సర్వే

బూర్జ : మండలంలోని నీలాదేవిపురంలో బుధవారం భూముల రీ సర్వే కార్యక్రమం నిర్వహించారు. ముందుగా గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామంలో భూ సమస్యలు ఉంటే తెలియజేయాలని సర్వే జరిగినప్పుడు వారి పొలం దగ్గర అందుబాటులో ఉండాలని, దగ్గరుండి తప్పులను సరిచూసుకొని బాధ్యత రైతులపై ఉందని తహశీల్దార్ వై.వి.పద్మావతి తెలిపారు. భూములు కొలతలు, వ్యత్యాసం భూములు పేర్లు మార్పు సర్వే నంబర్ల తేడా వంటి ఎలాంటి సమస్యలు ఉన్నా సర్వే సిబ్బంది దృష్టికి తీసుకొచ్చి సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో సైతం భూ సమస్యలు ఉండకూడదని, మరలా భూ రీ సర్వే కార్యక్రమం చేపట్టిందని అన్నారు. ఈ అవకాశం రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నార సంచులను ఆవిష్కరిస్తున్న కరుణశ్రీ

నార సంచుల ఆవిష్కరణ

రణస్థలం: ప్లాస్టిక్ నియోగం తగ్గించకపోతే అది మైక్రో ప్లాస్టిక్ రూపంలో వాతావరణంలో చేరి, గాలి, నీరు, ఆహారం ద్వారా మానవ శరీరాల్లో పేరుకుపోతుందని ఎపి కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్ బి.కరుణశ్రీ అన్నారు. శ్రీకాకుళంలోని తమ కార్యాలయంలో హరిత సమగ్ర గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రజల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్గించడానికి ప్లాస్టిక్ వద్దు అనే నినాదంతో తయారు చేసిన నార సంచులను ఆమె బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విచక్షణా రహితంగా ఒక్కసారి వాడి పారేస్తున్న పాలిథిన్, ప్లాస్టిక్ మట్టిలో కలియడానికి చాలా ఏళ్లు పడుతుందన్నారు. కార్యక్రమంలో హరిత సోసైటీ కోశాధికారి కలిశెట్టి ఆదినారాయణ, గౌరవ సభ్యులు రంభ దేవుడుబాబు, రావాడ కృష్ణ, కడవంటి మహేష్, కెంబూరి అప్పలనాయుడు పాల్గొన్నారు.

పలువురు ఆర్థికసాయం

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని గుమ్మడాంకు చెందిన ఉంగరాల కృష్ణారావు ఇటీవల కిడ్నీ వ్యాధితో బాధపడుతూ మృతి చెందారు. విషయం తెలుసుకున్న టిడిపి నాయకుడు మజ్జి రామ్మూర్తి బుధవారం పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మృతిని కుటుంబాన్ని కూటమి ప్రభుత్వం అందుకుంటుందని తెలిపారు. మృతుని భార్యకు పింఛను మంజూరుకు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ముప్పిడి వెంకటేశ్వరరావు, నాగం వెంకటరావు, గోవిందరావు, జి.అప్పారావు, గోవింద, నీలకంఠం పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: మండలంలోని రాజపేటకు చెందిన కరజాడ ఢిల్లేశ్వరి కేన్సర్ వ్యాధితో బాధపడుతుంది. ఆమె వైద్యం కోసం ఉద్దానం హెల్పింగ్ సొసైటీ బుధవారం రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. ఆమె విశాఖలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతుండడడంతో

లావేరు : పింఛను అందజేస్తున్న రామ్మూర్తి

ఆమె వద్దకు ఉద్దానం హెల్పింగ్ సొసైటీ ప్రతినిధి డి.దేవదాసు వెళ్లి రూ.10 వేలు నగదు అందించారు. త్వరగా కోలుకుని ఇంటికి తిరిగి రావాలని వారు ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆ సంస్థ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

కేకులతో దుకాణాలు కిటకిట

ప్రజాశక్తి- ఆమదాలవలస

2025వ సంవత్సరానికి వీడ్కోలు చెబుతూ 2026లోకి స్వాగతం పలికే నూతన సంవత్సర వేడుకల నేపథ్యంలో పట్టణంలోని మిఠాయి దుకాణాలు, బేకరీలు కేకులు, స్వీట్స్‌తో కిటకిటలాడుతున్నాయి. బుధవారం అర్ధరాత్రి నిర్వహించిన నూతన సంవత్సర వేడుకల్లో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేయడం ఆనవాయితీగా కొనసాగుతోంది. దీనికి అనుగుణంగా పట్టణంలోని మిఠాయి దుకాణాలు

కేకులతో నిండిన బేకరీలు

బేకరీలు వివిధ రకాల కేకులను పెద్ద ఎత్తున తయారు చేసి షో కేసుల్లో ఆకర్షణీయంగా అమర్చారు. అలాగే నూతన సంవత్సర వేడుకలకు వినియోగించే మిఠాయిల విక్రయాలు కూడా జోరుగా కొనసాగుతున్నాయి. వేడుకల నేపథ్యంలో పట్టణంలోని బేకరీలు, మిఠాయి దుకాణాలు, పూల దుకాణాల పరిసర ప్రాంతాలు సందడి సందడిగా మారి కనువిందు చేస్తున్నాయి.

చదువే ముద్దు

ప్రజాశక్తి- టెక్కలి

విద్యార్థులకు చదవే ముద్దు అని, చదువుకునే సమయంలో చెడు ఆలవాట్లకు దూరంగా ఉండాలని టెక్కలి ఎస్ఐ కె.రాము కోరారు. మండలంలోని చాకిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో బుధవారం విద్యార్థులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యార్థులు మొబైల్ వినియోగానికి దూరంగా ఉండాలన్నారు. చదువుతో పాటు క్రీడలపై ఆసక్తి కనబరిచేటప్పుడు చెడు అలవాట్లు దరికి రాకుండా కాపాడుకోగలరని తెలిపారు. అనంతరం శక్తియాప్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయులు కాపల నారాయణరావు అధక్షతన నిర్వహించిన సమావేశంలో ఉపాధ్యాయులు బాడాన నారాయణరావు, కె.మురళీకృష్ణ, పి.చిన్నారావు, పి.రుషి, తిరుపతిరావు, రమేష్ పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాలు తనిఖీ

రణస్థలం: మండలంలోని జె.ఆర్.పురం పంచాయతీలో మహాలక్ష్మి ట్రేడర్స్ ఎరువులు దుకాణాన్ని ఎఒ డి.విజయ్‌భాస్కర్ బుధవారం తనఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు ఎంఆర్‌పి ధరలకు ఎరువులు, పురుగు మందులు ఇవ్వాలన్నారు. ఎరువులు రిజిస్టర్‌ని అప్‌డేట్ చేయాలన్నారు. ధరల పట్టికను షాప్ ముందు ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఎఇఒ వై.రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

వజ్రపుకత్తూరు : మండలంలో ప్రైవేటు ఎరువుల దుకాణదారులు ఎరువులను అధిక ధరలకు

రణస్థలం : తనిఖీ చేస్తున్న ఎఒ విజయభాస్కర్

విక్రయిస్తే కఠిన చర్యల తప్పవని ఎఒ బమ్మిడి ధనుంజయరావు డీలర్లను హెచ్చరించారు. మండలంలోని పూండి వాణిజ్య కేంద్రంలోని లక్ష్మీగణపతి ఏజన్సీస్, సాయిరాం ట్రేడర్స్, తదితర ఎరువుల దుకాణాల్లో ఆయన తనిఖీలు చేపట్టారు. స్టాక్ రికార్డులు పరిశీలించారు.


డైరీని ఆవిష్కరిస్తున్న డిఇఒ రవిబాబు

డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ

స్కూల్ టీచర్స్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్ డైరీ, కేలండర్‌ను డిఇఒ ఎ.రవిబాబు, జిల్లా అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ ఎగ్జామ్స్ చంద్రభూషణ, జిల్లాలో ఎగ్జామ్స్ బోర్డు సెక్రటరీ సంజీవరావు విద్యాశాఖ కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నూతన సంవత్సరంలో జిల్లాలో విద్యాభివృద్ధికి యూనియన్లు సహకరించాలన్నారు. వంద రోజుల యాక్షన్ ప్లాన్ పగడ్బందీగా అమలైతే పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలవాలని ఆకాక్షించారు. కార్యక్రమం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.చందనరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.కె.రామిరెడ్డి, నెమలిపురి విష్ణుమూర్తి, జిల్లా అధ్యక్షులు సప్పటి మల్లేసు, ప్రధాన కార్యదర్శి పి.గోవిందరాజులు పాల్గొన్నారు.

ముగిసిన శిక్షణ

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి అదిత్య ఇంజినీరింగ్ కళాశాల మెకానికల్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యాన విద్యార్థుల కోసం నిర్వహించిన నాలుగు వారాల ఇంజెక్షన్ మోల్డింగ్ నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం బుధవారంతో విజయవంతంగా ముగిసిందని డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరావు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ శిక్షణను ఎంఎస్ఎంఇటూల్ రూమ్, సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్, హైదరాబాద్ నిపుణులు, ఎపిఎంఎస్ఎంఇ మద్దతుతో అందించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిఐటిడి హైదరాబాద్ డైరెక్టర్ డాక్టర్ టి.విజయకృష్ణ, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, మెకానికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ పి.శ్రీహరి, కన్వీనర్ డాక్టర్ డి.ఆజాద్, కో-కన్వీనర్ ఎం.వి.రమణ తదితరులు పాల్గొన్నారు.


ఒప్పందంపై సంతకం చేస్తున్న నాగేశ్వరరావు

మాట్లాడుతున్న కిరణకుమారి

లక్ష్యం వైపు పయనించాలి

టెక్కలి : పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులు ఒక లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకోవాలని, వాటిపైనే దృష్టి పెట్టి ముందుకెళ్లానని టెక్కలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ వట్టికూళ్ల కిరణకుమారి అన్నారు. స్థానిక అరుణా విద్యాలయంలో విద్యార్థులకు ఓరియంటేషన్ తరగతులు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చదువుకొనాలనే విద్యార్థి పాఠ్యాంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. ఉపాధ్యాయులు బోధించిన అంశాలపై శ్రద్ధగా వినాలన్నారు. డైరెక్టర్ తమ్మినేని ఆనందరావు మాట్లాడుత్తూ పాఠశాల ఏర్పాటు ఒక ఆశయం మీద నెలకొల్పామని అన్నారు. ప్రధానోపాధ్యాయులు హనుమంతు మల్లేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఉపాధ్యాయులు రవి, హేమలత పాల్గొన్నారు.